



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 300 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 6 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :300 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 6 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## అమరావతికి మరో 20 వేల ఎకరాలు...

# సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్

- సీఎం చంద్రబాబు నివాసంలో ముగిసిన సీఆర్డీఏ 50వ సమావేశం
- రాజధానిలో అదనంగా 20,494 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం
- హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లకు ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు గ్రీన్ సిగ్నల్
- నగరంలో నాలుగు కొత్త కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి ఓకే
- నిర్మాణ పనుల కోసం ఇసుక డ్రెడ్జింగ్‌కు సీఆర్డీఏకు అనుమతి
- గోపీచంద్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ అకాడెమీ సహా 16 సంస్థలకు భూ కేటాయింపులు



పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాజధాని పరిధిలో అదనంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని నివాసంలో జరిగిన 50వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 7 ప్రధాన అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. ఇందులో భాగంగా అమరావతి, తుళ్లూరు మండలాల్లోని ఏడు గ్రామాల్లో కలిపి మొత్తం 20,494 ఎకరాల భూమిని సమీకరించాలన్న ప్రతిపాదనకు అథారిటీ పచ్చజెండా ఊపింది. దీంతో పాటు, రాజధానిలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. మందడం, రాయపూడి, పిచుకలపాలెం వంటి ప్రాంతాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లు, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) పిలిచేందుకు అనుమతించారు. అంతేకాకుండా, అమరావతిలో నిర్మించనున్న ఫైవ్‌స్టార్ హోటళ్లకు సమీపంలో నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్లను నిర్మించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. రాజధాని నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూసేందుకు, ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చారు. రానున్న రెండేళ్లలో నిర్మాణాలకు 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు సీబీఐ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ క్రికెట్ అకాడెమీ, కిమ్స్ హాస్పిటల్ సహా 16 ప్రముఖ సంస్థలకు 65 ఎకరాల భూమిని కేటాయించేందుకు కూడా సీఆర్డీఏ అంగీకరించింది. వీటితో పాటు రాజధానిలోని ఈ-15 రహదారిపై ఆరు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాల ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## చిన్నారుల కలల సాకారానికి

# అండగా నిలుస్తాం

- చదువు కోసం కమిషనర్‌ను వేడుకున్న చిన్నారులు... చలించిపోయిన మంత్రి నారా లోకేశ్
- చదువు చెప్పించాలని కమిషనర్‌ను వేడుకున్న నెల్లూరు చిన్నారులు
- వారి దీనస్థితిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్
- పిల్లల విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- పేదరికాన్ని జయించే ఆయుధం చదువేనని వ్యాఖ్య
- చిన్నారుల కలలు సాకారం చేసేందుకు అండగా ఉంటామని హామీ

పెన్ పవర్ డెస్క్:చదువుకోవాలన్న తపనతో ఇద్దరు చిన్నారులు అధికారులను వేడుకున్న ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా చలించిపోయారు. ఆ పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను తక్షణమే ఆదేశించారు. వారి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరంలోని వీఆర్ స్కూలు వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమను బడిలో చేర్పించాలంటూ

వివరాలు 2లో..

## మూడేళ్లలో అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తి



పెన్ పవర్ డెస్క్: రాజధాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం కోసమే 10వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ అన్నారు. భూ సేకరణ వల్ల రైతులు నష్టపోతారనే ఉద్దేశంతోనే భూ సమీకరణకు వెళ్తున్నట్లు తెలిపారు. అమరావతి రెండో దశ భూ సమీకరణకు ఇప్పటికే 7 గ్రామాల పరిధిలో 20 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సమ్మతించినట్లు తెలిపారు. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన సీఆర్‌డీఏ 50వ అథారిటీ సమావేశంలో 7 అంశాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వెల్లడించారు. స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు మరో 2,500 ఎకరాల చొప్పున కేటాయించేందుకు సీఎం అంగీకరించారని వివరించారు.

వివరాలు 2లో..

## భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం..

# రోడ్లన్నీ జలమయం

- హైదరాబాద్ నగరంలో పలుచోట్ల కుండపోత వర్షం
- బేగంబజార్, కోఠి, ఖైరతాబాద్ సహా ప్రధాన ప్రాంతాలు జలమయం
- రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పలు ముఖ్యమైన రహదారులపై నిలిచిపోయిన ట్రాఫిక్
- పనులపై బయటకు వెళ్లిన ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు



పెన్ పవర్ డెస్క్:భాగ్యనగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షానికి నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలు జలమయమ య్యాయి. కార్యాలయాలు, ఇతర పనుల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని కోఠి, బేగంబజార్, అబిడ్స్, సుల్తాన్ బజార్, బషీర్ బాగ్, నాంపల్లి,

వివరాలు 2లో..

## ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు..

# గోయల్ గుండెలు బాదుకుంటారు

- అమెరికా సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని రాహుల్ విమర్శ
- మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం ఖాయమన్న రాహుల్
- జులై 9 గడువులోగా భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై తీవ్ర చర్చలు
- గడువుల కోసం ఒప్పందాల్లో తొందరపడబోమని స్పష్టం చేసిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని, ఈ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏమీ చేయలేరని ఆయన వ్యాఖ్యానించారు. తన మాటలను రాసిపెట్టుకోవా లంటూ సవాల్ విసిరారు. మూడు నెలల క్రితం భారత్‌పై అమెరికా 26 శాతం సుంకాలు

వివరాలు 2లో..



## ఐదేళ్లు అరాచకాలు చేసి..

# ఇప్పుడు నీతులు చెబుతున్నారా?



పెన్ పవర్ డెస్క్: వైకాపా ఖాళీ అవడం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైకాపా నాయకులు అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లు అరాచకాలు చేసి, ప్రజలను పీడించుకొని తిని.. నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. త్వరలో వైకాపా కార్యాలయానికి టూ-లెట్ బోర్డు పెట్టబోతున్నారని.. అందుకే ఆందోళనలో ఆ పార్టీ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బియ్యం కొట్టేసిన దొంగతో ప్రెస్ మీట్ పెట్టించడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. దొంగల తో ప్రయాణం చేస్తున్న జగన్ రెడ్డి.. పెద్ద దొంగ అని మంత్రి అన్నారు. సింగయ్య మృతికి సంబంధించి విజువల్స్ అంతా క్లియర్‌గా ఉంటే తమకు ఎలాంటి సంబంధం లేదని జగన్ రెడ్డి

వివరాలు 2లో..

## శేషాచలం ఫారెస్ట్ లో 'పుష్ప' సీన్...

# పోలీసులపై స్మగ్లర్ల దాడి



- శేషాచలంలో పోలీసులపై ఎర్రచందనం స్మగ్లర్ల ఎదురుదాడి
- అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో చోటుచేసుకున్న ఘటన
- తమిళనాడుకు చెందిన స్మగ్లర్ గోవిందన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ. 80 లక్షల విలువైన 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- తప్పించుకున్న మరో 10 మంది కోసం ముమ్మర గాలింపు
- స్మగ్లర్ల నుంచి కత్తులు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

వివరాలు 2లో..

## తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి మరో ప్రయత్నం

- తాడిపత్రి వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరో ప్రయత్నం
- అనుమతి కోరుతూ ఎస్పీ జగదీశ్‌కు తాజాగా లేఖ
- హైకోర్టు ఆర్డర్ ఉన్నా అనుమతి కోసం ఎదురుచూపులు



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు చేస్తున్న ప్రయత్నాలు స్థానికంగా ఉత్కంఠ రేపుతున్నాయి. వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చిన 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని తాడిపత్రిలో నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎస్పీ జగదీశ్‌కు తాజాగా ఓ లేఖ రాశారు. ఈ లేఖతో తాడిపత్రిలో ఆయన ప్రవేశం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

వివరాలు 2లో..

## సుపరిపాలనలో తొలి అడుగు... కరపత్రాలతో

# ప్రజల్లోకి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు



- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళం జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ముఖాముఖి
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలను వివరించిన మంత్రి
- సూపర్ సిక్స్ హామీలను దాదాపుగా నెరవేర్చామని వెల్లడి
- రాష్ట్రానికి పరిశ్రమలను తిరిగి తీసుకువస్తున్నామని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## మనుషుల్ని చంపడమే

# ఆయన పని

## పుతిన్‌పై ట్రంప్ ఆగ్రహం

- ట్రంప్, పుతిన్ మధ్య విఫలమైన శాంతి చర్చలు
- పుతిన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన డొనాల్డ్ ట్రంప్
- యుద్ధ విరమణ ప్రతిపాదనను తిరస్కరించిన రష్యా
- చర్చలు ముగిశాక ఉక్రెయిన్‌పై పెరిగిన దాడులు
- గంటపాటు మాట్లాడినా ఎలాంటి పురోగతి లేదని ట్రంప్ వెల్లడి
- ఇప్పటికి ఆరుసార్లు భేటీ అయినా ఫలితం శూన్యం



పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు మరోమారు విఫలమయ్యాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేకపోవడంతో ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పుతిన్‌పై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరువురు నేతలు దాదాపు గంటసేపు ఫోన్ లో సంభాషించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మారలేదుగా అంతేనా?

వైసీపీలో నాయకత్వంపై నేతలకు ఇంకా నమ్మకం కలగడం లేదు. జనంలో పార్టీ పట్ల కొంత పాజిటివ్ వేవ్స్ కనిపిస్తున్నా అది నిలబెట్టుకుంటారన్న నమ్మకం నేతలకు లేదు. అందుకు నాయకత్వ వైఖరి కారణం. జగన్ ఇంకా తన పాత వైఖరిని అవలంబిస్తున్నారు. కోటరీ మధ్యనే ఆయన ఇంకా కూరుకుపోయి ఉన్నారు.అనేక మంది నేతలు కోటరీపై విమర్శలు చేస్తూ బయటకు వెళ్లిపోయాని జగన్ తీరు మారలేదని అంటున్నారు. అందుకు కారణం వారిని జగన్ బలంగా నమ్మడమేనని, అంతకు మించి వారి చేతుల్లో జగన్ ఉన్నారని నేతలకు స్పష్టమయింది. అందుకే నేతలు గతంలో మాదిరిగా ఉత్సాహంగా జగన్ పిలుపు నిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని అంటున్నారు.

**వాస్తవ పరిస్థితులు...**

జగన్ చుట్టూ ఇంకా కోటరీ చుట్టుముట్టి ఉందని, దాటిని దాటుకుని వెళ్లి వాస్తవ పరిస్థితులు చెప్పేందుకు వీలు కలగడం లేదంటున్నారు. తమ నియోజకవర్గాలు మాత్రమే కాదు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులతో పాటు నేతలపై నమోదవుతున్న కేసులు ఒకవైపు పార్టీకి దూరం చేస్తుంటే మరొక వైపు కోటరీ తో జగన్ కు, లీడర్లకు మధ్య గ్యాప్ పెరిగిందంటున్నారు. పార్టీకి నాయకత్వం వహించేవారు జనంలో నిత్యం తిరిగే నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. దానికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకోవడానికి వీలుంటుంది. కానీ జగన్ నిర్వహిస్తున్న సమావేశాలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయన్నది ఎక్కువ మంది నాయకుల అభిప్రాయం.

**సీనియర్ నేతల సలహాలు...**

వైసీపీలో సీనియర్ నేతలకు కొదవ లేదు. రాజకీయ అనుభవం ఉన్నవాళ్లున్నారు. దశాబ్దాల నుంచి రాజకీయాలను ఒడిసిపట్టిన నేతలను కూడా జగన్ ఉపయోగించుకోవడం లేదంటున్నారు. సీనియర్ నేతలు అని కూడా చూడకుండా తాను చెప్పిందే వినాలని, కోటరీ చెప్పిన మాటలనే సమావేశాల్లో జగన్ చెబుతుండటంతో నేతలు చేష్టలుడిగి చూస్తున్నారు. గత ఎన్నికల్లో ఇంత దారుణంగా దెబ్బతిన్నప్పటికీ, కేవలం పదకొండు సీట్లకే పరిమితమయినా దానిపై కనీసం సమీక్షలు చేయకుండా, కారణాలు అన్వేషించకుండా భవిష్యత్ లో ఏం చేయాలన్న దానిపై సీనియర్ నేతలతో చర్చింకుండా కార్యక్రమాలను ప్రకటించడం పట్ల కూడా పలువురు నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**వ్యతిరేకతపైనే...**

ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, నాలుగేళ్లలో మరింత వ్యతిరేకత పెరిగి వైసీపీ విజయం ఖాయమని జగన్ అనుకుంటున్నారే తప్పించి ఫీల్డ్ లెవెల్లో పరిస్థితులను తెలుసుకుని దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలన్న ధ్యాస కనిపించడం లేదని నేతలు వాపోతున్నారు. అందుకే దాదాపు ఎనభై శాతం మంది నేతలు కోటరీకి భయపడి అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తూ, సమావేశాల్లో జగన్ చెప్పిన దానికి తలూపి వస్తున్నారని అంటున్నారు. నిజానికి గత వైసీపీ హయాంలో చేసిన తప్పులను తెలుసుకుని తిరిగి తాము అధికారంలోకి వస్తే వాటిని అమలు చేయమని ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన సమయంలో అధికార పార్టీ వ్యతిరేకతపైనే జగన్ ఆధారపడి ముందుకు వెళుతున్నారంటున్నారు. అదే ఇప్పుడు ఫ్యాన్ పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.

# శేషాచలం ఫారెస్ట్ లో 'పుష్ప' సీన్... పోలీసులపై స్మగ్లర్ల దాడి

శేషాచలం అడవుల్లో 'పుష్ప' సినిమా సీన్ కనిపించింది. ఎర్రచందనం స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైనే ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ దాడిలో ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, సుమారు రూ. 80 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే, సుండుపల్లి మండలం కావలిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను ఒక డంపింగ్ కేంద్రం నుంచి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులను చూసిన సుమారు 11 మంది స్మగ్లర్లు, కూలీలు వారిపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు.ఈ క్రమంలో పోలీసులు ధైర్యంగా వారిని ఎదుర్కొని, తమిళనాడుకు చెందిన గోవిందన్ అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా, రూ. 80 లక్షల విలువ చేసే 26 ఎర్రచందనం దుంగలతో పాటు, రెండు కత్తులు,

రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. గోవిందన్‌పై గతంలోనూ ఇలాంటి నాలుగు కేసులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. పరారైన స్మగ్లర్ల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. తమిళనాడు నుంచి కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం ఉండటంతో గ్రామాల్లో నిఘా పెంచామని పోలీసులు తెలిపారు.

# సుపరిపాలనలో తొలి అడుగు... కరపత్రాలతో ప్రజల్లోకి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల్లోకి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలంలోని చిన్న బమ్మిడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ఇంటింటికీ తిరుగుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.

చిన్న బమ్మిడి గ్రామానికి చేరుకున్న అచ్చెన్నాయుడికి స్థానిక ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రతి ఇంటి గడప తొక్కుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు తీరును, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వారికి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్

సిక్స్ హామీలను తమ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో తిరిగి తీసుకువస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

# భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం

- మొదటి పేజీ తరువాయి

హిమాయత్ నగర్, నారాయణ గూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ వంటి కీలక ప్రాంతాల్లో రహదారులు నీటితో నిండిపోయాయి. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షం కారణంగా వాహనదారులు, పాదచారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి అవస్థలు పడ్డారు.

# ఐదేళ్లు అరాచకాలు చేసి.. ఇప్పుడు నీతులు చెబుతున్నారా?

- మొదటి పేజీ తరువాయి

తప్పిం చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగయ్య మృతితో ఎలాంటి సంబంధం లేనప్పుడు కుటుంబాన్ని ఎందుకు పరామర్శించారని మంత్రి ప్రశ్నించారు. కక్షపూరిత రాజకీయాలకు జగన్ కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారని విమర్శించారు.

# చిన్నారుల కలల సాకారానికి అండగా నిలుస్తాం

- మొదటి పేజీ తరువాయి

కమిషనర్‌ను ప్రాధేయపడ్డారు. ఈ విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లింది.

ఈ ఘటనపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడటం నన్ను కదిలించింది. వారి చదువుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అక్కడి అధికారులను ఆదేశించాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక్కటే బలమైన సాధనమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలన్న కసి, పట్టుదల ఉంటే ఎలాంటి కష్టాలనైనా అధిగమించవచ్చని ఆయన అన్నారు. ఈ చిన్నారుల ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని కూడా ఆయన తన పోస్టుతో పాటు పంచుకున్నారు.

# మనుషుల్ని చంపడమే ఆయన పని

- మొదటి పేజీ తరువాయి

ఈ చర్చల అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, "పుతిన్ మారరు. ఆయనకు మనుషులను చంపుతూనే ఉండాలని ఉంది. ఇది ఏమాత్రం మంచిది కాదు" అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. "ఈ రోజు మా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. ఉక్రెయిన్ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను" అని తన నిరాశను వ్యక్తం చేశారు.

తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ చేసిన సూచనను పుతిన్ తిరస్కరించినట్లు ఆయన సహాయకుడు యూరీ ఉషాకోవ్ ధృవీకరించారు. యుద్ధంలో తమ లక్ష్యాలను సాధించేందుకే కట్టుబడి ఉన్నామని రష్యా స్పష్టం చేసింది. అయితే, దౌత్యపరమైన పరిష్కారానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ ఫోన్ కాల్ ముగిసిన కొద్దిసేపటికే రష్యా సేనలు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు మరో 13 నగరాలపై భీకర దాడులకు దిగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన కోసం ట్రంప్, పుతిన్ మధ్య చర్చలు జరగడం ఇది ఆరోసారి.

# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు.. గోయల్ గుండెలు బాదుకుంటారు

- మొదటి పేజీ తరువాయి

విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల సస్పెన్షన్ గడువు జులై 9తో ముగియనుండటంతో ఆలోగా ఓ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఈ విమర్శలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠమైన విధానాలను అనుసరిస్తోందని స్పష్టం చేశారు. గడువులను చూసి కీలక ఒప్పందాలపై తొందరపడబోమని, ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూరితేనే ముందుకెళ్తామని ఆయన తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా వస్త్రాలు, ఆభరణాలు, రొయ్యలు, ప్లాస్టిక్స్ వంటి ఉత్పత్తులపై సుంకాల మినహాయింపును భారత్ కోరుతోంది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలు, పారిశ్రామిక వస్తువులు,

పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. అయితే, పాడి, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గిస్తే దేశీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళనల నేపథ్యంలో ఆ డిమాండ్లకు భారత్ అంగీకరించడం లేదు. ఇప్పటికే చర్చల నిమిత్తం అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగిరావడంతో జులై 9లోగా ఓ మధ్యంతర ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం.

# తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి మరో ప్రయత్నం

- మొదటి పేజీ తరువాయి

ఒకప్పుడు టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఎదురైన పరిస్థితులే ఇప్పుడు కేతిరెడ్డికి ఎదురవుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి, కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని, ఆయనకు తగిన భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏప్రిల్ 30వ తేదీన స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ, గతంలో ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు, తాజాగా ఆయన రాసిన లేఖ నేపథ్యంలో ఈసారి పోలీసు యంత్రాంగం ఎలా స్పందిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేతిరెడ్డికి అనుమతి లభిస్తుందా లేదా అనే విషయంపై తాడిపత్రి రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.

# గుడివాడ వన్ టౌన్ పీఎస్ కు వెళ్లిన కొడాలి నాని

### రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై దాడి కేసులో బెయిల్

### షరతుల్లో భాగంగా గుడివాడ పీఎస్ కు వెళ్లిన కొడాలి నాని

### పీఎస్ లో సంతకం చేసిన మాజీ మంత్రి



వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో హాజరయ్యారు. ఓ కేసులో భాగంగా కోర్టు విధించిన ముందస్తు బెయిల్ షరతులను పాటిస్తూ ఆయన పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన, ఇటీవల మళ్లీ గుడివాడలో కనిపిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే, గుడివాడ మాజీ ఎమ్మెల్యే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు చెందిన వస్త్ర దుకాణంపై దాడి జరిగిన ఘటనలో కొడాలి నానిపై కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్ట్ కాకుండా ఉండేందుకు ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, కింది కోర్టులోనే బెయిల్ తీసుకోవాలని హైకోర్టు సూచించడంతో, ఆయన గుడివాడ కోర్టును ఆశ్రయించారు.అక్కడ అవసరమైన పత్రాలు సమర్పించగా, గుడివాడ కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆ షరతుల్లో భాగంగానే కొడాలి నాని ఈ రోజు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేశారు. గతంలో ఆయన అరెస్ట్ అయ్యారంటూ వచ్చిన వదంతులను పోలీసులు అప్పుడే ఖండించిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో ఆయన బెయిల్ షరతులను పాటిస్తున్నట్లు స్పష్టమైంది.

# మూడేళ్లలో అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తి

- మొదటి పేజీ తరువాయి

అమరావతిలో 5 స్టార్ హోటళ్లకు అనుబంధంగా 10వేల మంది సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు అదనంగా 2.5 ఎకరాలు, 7,500 మంది సామర్థ్యంలో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు మరో 2 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుకను కృష్ణా నదిలో తవ్వుకునేలా సీఆర్‌డీఏకు అనుమతులు మంజూరు చేశారు. ప్రణాళిక ప్రకారం వచ్చే మూడేళ్లలో రాజధాని అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తవుతుందని నారాయణ స్పష్టం చేశారు.

**సీఆర్‌డీఏ నిర్ణయాలు**

రాజధానిలో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్ఎఫ్‌పీగా పిలిచేందుకు ఆమోదం

అమరావతిలో నిర్మించే ఫైవ్ స్టార్ హోటళ్ల సమీపంలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ ప్రతిపాదనకు అథారిటీ ఆమోదం

మందడం, తుళ్లూరు, లింగాయపాలెంలో 2.5 ఎకరాల చొప్పున నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి క్యూబీఎస్ ప్రాతిపదికన అమోదం

అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల కోసం ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక తవ్వుకునేందుకు అనుమతి

వచ్చే రెండేళ్లలో రాజధాని నిర్మాణానికి 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అంచనా

భూముల కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

సీబీఐ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాల భూ కేటాయింపులకు ఆమోదం

రాజధానిలోని ఈ-15 రహదారిపై 6 లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం

పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాలు ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ఆమోదం.

## వైభవంగా శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్ధేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# పి4 పై ముఖ్యమంత్రి సమీక్ష

- జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్
- జిల్లాలో 80,331 బంగారు కుటుంబాలు ఉండగా 1911 కుటుంబాలను దత్తత తీసుకున్నాం : జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్





**తిరుపతి, పెన్ పవర్ జూలై 5 :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పి4 కార్యక్రమం పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమీక్షించారు. తిరుపతి జిల్లా నుంచి సి పి ఓ, డిఏవిపి సచివాల సిబ్బంది తో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 80,331 కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 1911 కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునే కార్యక్రమం జరుగుతుందన్నారు.ఆగస్టు 15 లోగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలను దత్తత తీసుకునే చర్యలలో భాగంగా జిల్లాలో అత్యధిక కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# రాంనగర్, నాయక్ నగర్ అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తాం

- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి - ఎంపీ అంబికాతో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు
- సీఎం చంద్రబాబు స్ఫూర్తితో నా కుమార్తె అశ్రిత పీ4లో ముందుకొచ్చారు - రాష్ట్రంలో ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా ఇచ్చిన హామీలు నెరవేర్చాం.. ఎంపీ అంబికా

**అనంతపురం పెన్ పవర్ జులై 5 :** అనంతపురం నగరంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న రాంనగర్, మారుతి నగర్, నాయక్ నగర్ రైల్వే లైన్ల వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని మారుతీనగర్ లో నిర్వహించిన సుపరిపాలన తొడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మారుతి నగర్ ఫస్ట్ క్రాస్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పథకాలని వివరిస్తూ ఇందులో మీకు ఏవి వచ్చాయి.. ఏవి రాలేదన్నది ఆరా తీశారు. దాదాపు అన్నిచోట్ల ప్రభుత్వ పని తీరుపై హర్ష వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ తొలి ఏడాదిలోని కీలకమైన హామీలన్నీ నెరవేర్చిన ప్రభుత్వమిది అన్నారు. అందుకే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పాఠశాల ప్రారంభం రోజే తల్లికి వందనం ఇచ్చారని.. మెగా డీఎస్సీ, ఉచిత సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు వంటివి చేశామన్నారు. తొలి ఏడాదిలో 9.50 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకురావడంతో పాటు 8.50 లక్షల ఉద్యోగాలు కూడా ఇచ్చామన్నారు. 2047కల్లా పేదరికం అన్నది లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమం పట్ల దగ్గుపాటి ఫౌండేషన్ ఫౌండర్, తన కుమార్తె అయిన దగ్గుపాటి అశ్రిత ఆకర్షితులై 25 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ 25 కుటుంబాల బాధ్యత దగ్గుపాటి ఫౌండేషన్ చూసుకుంటుందన్నారు. రాంనగర్, నాయక్ నగర్ లో రైల్వే లైన్ అండర్ పాస్ లేకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు





పడుతున్నారని, త్వరలోనే వీటిని నిర్మించేందుకు భూమి పూజ జరుగుతుందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు.

ఏడాది పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, తమ ప్రభుత్వానికి మద్దతు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ ఇంచార్జ్ గోళ్ళ సుధాకర్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జె ఎల్ మురళీధర్, రాయల్ మురళి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిలు గడ్డం సుబ్రమణ్యం, డైరెక్టర్లు పోతుల లక్ష్మీ నరసింహులు, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, బొమ్మినేని శివ, టిడిపి నాయకులు సరిపుటి రమణ, డిష్ నాగరాజు, దలవాయి వెంకటనారాయణ, సుధాకర్ యాదవ్, సాకే లక్ష్మీ నరసింహ, కుంచెపు వెంకటేష్, రాజా రావు, సాకే జయప్ప, కృష్ణకుమార్, ఫిరోజ్ అహ్మద్, మోహన్ కుమార్, సంగా తేజస్విని, నెట్టెం బాలకృష్ణ, మున్వర్, సరళ,వడ్డే భవాని, తాటి మధు, ఇస్మాయిల్, రూపనగుడి రవి రాయల్, ఈడిగ నాగ భూషణం, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ

# మరింత వేగవంతంగా చేపట్టాలి

- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ జులై 05 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో శనివారం అహుడా పరిధిలోని అనంతపురము రూరల్ మరియు బుక్కరాయసముద్రం మండల పంచాయితీ కార్యదర్శులు, ఈఓపిఆర్డీలు, డిఎల్పిఓలతో పంచాయితీల పరిధిలో ఆన్ లైన్ విధానంలో భవన నిర్మాణ అనుమతులు మరియు అనధికారిక లేఅవుట్లపై చర్యలు అనే అంశముపై జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. అహుడా పరిధిలోని గ్రామ పంచాయితీలలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగవంతంగా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యుడిఎల సహకారముతో ఆధునిక టెక్నాలజీ ఆధారంగా జూలై 2023 నుండి ఆన్లైన్ సర్వీసు ప్రవేశపెట్టిందన్నారు. అన్ని గ్రామ పంచాయితీలలో ఆన్ లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ కొందరు పంచాయతీ కార్యదర్శులు, ఇప్పటికీ ఆఫ్ లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తున్నారని, అవి చట్టరీత్యా నేరమని అటువంటి అనుమతులు చెల్లవని తెలియజేశారు. అహుడా పరిధిలోని గ్రామ పంచాయతీలలో అన్ని అనుమతులు ఆన్ లైన్ లో మాత్రమే జారీచేయాలని, అందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే అహుడా వారికి తెలియజేయాలన్నారు. దీనికి స్పందిస్తూ కొందరు పంచాయతీ కార్యదర్శులు ఐఆర్ఎస్ 2020 స్కీమ్ నందు అప్రూవ్ కాబడిన ఐపిఎల్‌పిలే అవుట్లలోని ప్లాట్లలో భవన నిర్మాణ అనుమతులు పొందడం ఇబ్బందికరంగా వుందని, దీనిని వెంటనే పరిష్కరించాలని వైస్ చైర్పర్సన్ ని కోరారు. అలాగే ఎల్ఆర్ఎస్ 2020 స్కీమ్ లో రెగ్యులరైజ్ అవ్వడానికి ఆస్కారము వుండి, ఆ అవకాశాన్ని వుపయోగించలేక పోయిన లేఅవుట్లలోని ప్లాట్లలో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ఏదైనా పరిష్కారము చూపాలన్నారు. పై విషయంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఐఆర్ఎస్ 2020 స్కీమ్ లో అప్రూవ్ కాబడిన ఐపిఎల్‌పి లే అవుట్లలోని ప్లాట్లలో భవన నిర్మాణ అనుమతులు పొందేవిధంగా వచ్చేవారంలో ఆన్ లైన్ వ్యవస్థను అప్ డేట్ చేస్తామని తెలియజేశారు. అలాగే %ూ=ూ% 2020 స్కీమ్ లో రెగ్యులరైజ్ అవ్వడానికి ఆస్కారము వున్న (31-08-2019 కి ముందు ప్లాట్ గా రిజిస్టర్ కాబడిన స్థలాలు) స్థలాలలో ప్రభుత్వం నిర్దేశించిన ఎల్ఆర్ఎస్ చార్జీలు మరియు కంపౌండింగు చార్జీలు విధించి అనుమతులు జారీచేయుటకు మరియు గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థితి మెరుగు పరచు నిమిత్తము అతి త్వరలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వైస్-చైర్పర్సన్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.యం.యస్.నెం.03 తేది:09-01-2025 ద్వారా ఆంధ్ర ప్రదేశ్ భూ అభివృద్ధి (లేఔట్, సబ్ డివిజన్) నిబంధనలు, 2017-సవరణలు జారీచేశారని తెలియజేశారు. అందులో భాగంగా గతములో నిర్దేశించిన 12 మీటర్లు (40 అడుగులు) కనీస లేఅవుట్ రోడ్డు వెడల్పు నిబంధనను సరళీకృతం చేస్తూ 9 మీటర్లు (30 అడుగులు) కు కుదించడమైనదన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అహుడాలో లెఔట్ అనుమతులు పొందవలెనని, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని రియల్టర్లు మరియు భూ యజమానులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మరియు లేఔట్ నిభందనలు సరళికృతం అయినప్పటికీ, అనధికారిక లేఅవుట్లు వేయుచూ ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న రియల్టర్లు మరియు భూ యజమానులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో అహుడా సెక్రటరీ జి.రామక్రిష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కె.యం.డి.ఇషాక్ మరియు అహుడా ప్లానింగ్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఈఓపిఆర్డీలు, డిఎల్పిఓలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

## హంద్రీనీవా సుజల స్రవంతి బిటిపి కాలువ పనులు ప్రారంభం



**అనంతపురం పెన్ పవర్ జులై 5 :** బ్రహ్మసముద్రం మండలం వెస్ట్ కోడిపల్లి గ్రామం వద్ద శనివారం సాయంత్రం హంద్రీనీవా సుజల స్రవంతి - బిటిపి కాలువ పనులను కళ్యాణదుర్గం పునఃప్రారంభోత్సవం జరిగింది.

ఎమ్మెల్యే అమిలి నేని సురేంద్రబాబు, ప్రభుత్వ విప్ మరియ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్డీఓ వసంతబాబు, ఆయా శాఖల అధికారులు, పెద్దఎత్తున ప్రజలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా శ్రీ చెన్నకేశవ, శ్రీ సిద్దేశ్వరస్వాములవారి

# వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



**తిరుమల పెన్ పవర్ జూలై 5 :** టిటిడికి అనుబంధంగా ఉన్న అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంకుర్పాణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ సిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం 05.00 గం.లకు, శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో సాయంత్రం 06.00 గం.లకు అంకురార్పణ జరిగింది.

**శ్రీ సిద్ధేశ్వరస్వామివారి వాహనసేవలు :** జూలై 06వ తేదీ ఉదయం 06.16 గం.లకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి హంసవాహన సేవ నిర్వహిస్తారు. జూలై 07న ఉదయం పల్లకీ సేవ, రాత్రి చంద్రప్రభ వాహనం, జూలై 08న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి చిన్నశేష వాహనం, జూలై 09న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి సింహ వాహనాలపై స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. జూలై 10న ఉదయం పల్లకీ సేవ, రాత్రి నంది వాహనం సేవ చేపడుతారు. జూలై 11న సాయంత్రం 6.00 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.300/- చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్న ప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఆ తరువాత రాత్రి 07.30 గంటలకు గజవాహనంపై స్వామివారు విహరించనున్నారు. జూలై 12న సాయంత్రం పల్లకీ సేవ, జూలై 13న రాత్రి 6.00 గంటలకు పార్వేట ఉత్సవం, జూలై 14న ఉదయం 10.00 - 12.00 గంటలకు వసంతోత్సవం, త్రిశూలస్నానం, సాయంత్రం 05.00 - 06.00 గం.ల మధ్య ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. జూలై 15వ తేదీన ఉదయం 09.00 గం.లకు స్నపన తిరుమంజనం, రాత్రి 6 -8 గం.ల మధ్య పుష్పయాగం చేపడుతారు.

**శ్రీ చెన్నకేశవస్వామివారి వాహనసేవలు :** జూలై 06న ఉదయం 9 నుండి 10 గంటల మధ్య సింహలగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి శేషవాహన సేవ నిర్వహిస్తారు. జూలై 07న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, జూలై 08న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి సింహ వాహనం, జూలై 09న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి హనుమంత వాహనాలపై స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. జూలై 10న ఉదయం 09.00 గం.లకు మోహినీ అవతారం, రాత్రి గరుడసేవ నిర్వహిస్తారు. జూలై 11వ తేదీ సాయంత్రం 6 గం.లకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.300/- చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఆ తరువాత రాత్రి 08.30 గంటలకు గజ వాహనంపై స్వామివారు విహరిస్తారు. జూలై 12న సాయంత్రం 06.00 - 08.00 గం.ల మధ్య రథోత్సవం, జూలై 13న రాత్రి అశ్వవాహనం, జూలై 14న ఉదయం 09.30 - 10.15 గంటలకు చక్రస్నానం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం 6.00 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. జూలై 15వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీ చెన్నకేశవస్వామి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం ఘనంగా జరుగనుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండ్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ బాలాజీ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## బత్తలపల్లి వద్ద ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం





**ధర్మవరం పెన్ పవర్ జూలై 5 :** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన బైపాస్ వేల్పుమడుగు మలుపులో ప్రమాదం జరిగింది. ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్సై సోమశేఖర్ కథనం మేరకు.. గంటాపురానికి చెందిన ఓబులేసు, బత్తలపల్లికి చెందిన సదాశివ ఇద్దరూ బైకులో గంటాపురం వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## 10న మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ సమావేశాలు

### - కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వైఎస్సార్ కడప పెన్ పవర్ జులై 05 : ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని వీసీ హాల్లో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ సమావేశాలపై.... జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా "మెగా పేరెంట్ టీచర్ మీట్" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ, కళాశాలలోనూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులతో వన్-టు- వన్ సమావేశంనిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల యొక్క మానసిక, సామాజిక స్థితి, ప్రవర్తన, అభ్యసన సామర్థ్యం.. గురించి సంబందిత క్లాస్ టీచర్ లేదా హెడ్ మాస్టర్ లతో పేరెంట్స్ చర్చించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి బాధ్యత కేవలం పాఠశాల ఉపాధ్యాయులదే కాకుండా.. తల్లిదండ్రులది కూడా ప్రధాన భూమిక బాధ్యత అన్న విషయాన్ని ఇందులో తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి చాలా వివరణాత్మకంగా.. ఆ విద్యార్థి యొక్క 6 నెలల అభివృద్ధికి సంబంధించి హొలిస్టిక్ రిపోర్టుని కుడా అందివ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ, టీచర్స్ మీటింగ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే.. పేరెంట్స్ కమిటీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం కావలి అన్నారు. పాఠశాలలో సాధించిన ప్రగతి విద్యార్థుల అభ్యున్నతికి ఈ పేరెంట్స్ టీచర్స్ మెగా ఈవెంట్లు దోహూత పడతాయని తెలిపారు. ఆరోజు పాఠశాల కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఆరోజు పాఠశాలల్లో మిడ్ డే మీల్ ఆరోజు మెనూ ప్రకారం తల్లిదండ్రులకు వడ్డించడం జరుగుతుందన్నారు. మిడ్ డే మీల్ లో విప్లవాత్మక మార్పులు జరిగాయని రాష్ట్రంలో మొదటి సారి స్మార్ట్ కిచెన్ ను సి కే దిన్నె,జమ్మలమడుగు లో త్వరలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు.నాలుగవ తరగతి పైబడిన విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు నమస్కరించి అమ్మ పేరు మీద చెట్టు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. లీప్ యాప్ ద్వారా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత గ్రీన్ పాస్ పోర్టు పొందే విధంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పిల్లల్లో చిన్ననాటి నుండే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. జులై 10వ తేదీన ఉదయం చెట్లు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల వారీగా ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పాఠశాల కమిటీలు, దాతలు,తల్లిదండ్రులు భాగస్వాములై పిల్లల భవిష్యత్తుకు నూతన బాటలు వెయ్యాలని కోరారు.విద్యార్థుల అభివృద్దే ధ్యేయంగా నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీట్స్ నిర్వహణ విజయవంతంగా జరిగేలా చూడాలని అందుకు మీడియా కూడా ప్రధాన పాత్ర పోషించాలనీ కోరారు.

## బత్తలపల్లి బైపాస్ రోడ్ వద్ద ఘోర ప్రమాదం

### - ఇద్దరు యువకుల మృతి

### హరీష్ బాబు నివాళి - ప్రభుత్వ భరోసా కల్పన

### బీజేపీ నేత హరీష్ బాబు స్పందన




**ధర్మవరం పెన్ పవర్ జూలై 05 :** బత్తలపల్లి వద్ద నూతనంగా నిర్మించబడిన బైపాస్ రోడ్ పై శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన వెలుగులోకి వచ్చింది. గంటాపురానికి చెందిన ఓబులేసు మరియు గుమ్మాలకుంట గ్రామానికి చెందిన సదాశివ అనే ఇద్దరూ బైకులో ప్రయాణిస్తుండగా, వేగంగా దూసుకువచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషాద వార్తను తెలుసుకున్న మంత్రి నియోజకవర్గ ఇన్చార్జి హరీష్ బాబు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాలకు అంతిమ దర్శనం నిర్వహించి, నిమ్మిత నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తరపున హరీష్ బాబు సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం అధికారులతో మాట్లాడి మృతదేహాల పోస్టుమార్టం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించి, అవి తక్షణమే పూర్తి చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ %-%ఇద్దరు అమాయకుల ప్రాణాలు కోల్పోవడం మనసును కలచివేస్తోంది. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి బాధను అర్థం చేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వ తరపున పూర్తి మద్దతును అందిస్తాం. ముఖ్యంగా రోడ్డు భద్రత కోసం అధికారులు మరింత చొరవ చూపాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు.

### టిటిడిలో నిర్మాణంలో ఉన్న భవనాలను

# నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి

### అలిపిరి టోల్ కేట్ విస్తరణకు చర్యలు : టిటిడి ఈవో జె.శ్యామలరావు



**తిరుపతి పెన్ పవర్ జులై 5 :** శ్రీవారి భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న భవనాలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరితో కలసి శనివారం అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టిటిడిలో జరుగుతున్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుని నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుత్తేదారులలో అలసత్వం లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి నివేదిక సమర్పించాలని కోరారు. టిటిడిలో దళారి వ్యవస్థ, నకిలి టికెట్ల పేరుతో సేవల టికెట్ల అమ్మకాలు, అవినీతిపై మరింత నిఘా ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు మరింత నాణ్యంగా, వేగంగా సేవలు అందించేందుకు అలిపిరి టోల్ గేట్ ప్లాజా వద్ద చెకింగ్ పాయింట్ విస్తరణ, లేటెస్ట్ కెమెరాల ఏర్పాటు, వాహనాలు, లగేజీ స్కానింగ్ యంత్రాలు, సెక్యూరిటీ పెంచే అంశం తదితర అంశాలపై టిటిడి సెక్యూరిటీ, ఇంజనీరింగ్, ఐటీ అధికారులు అంతర్జాతీయ విమానాశ్రయాలలో సౌకర్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, ఆధునిక సౌకర్యాలతో కళ్యాణ కట్ట కొరకు ఎంపిక చేసిన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా నిర్మాణం చేపట్టి దశలవారీగా విస్తరణ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించేందుకు నిల్వ వుంచే వంటసామాగ్రి కోసం మార్కెటింగ్ గోడౌన్ లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్ లో భాగంగా అలిపిరి భూదేవి కాంప్లెక్స్ లో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం, శ్రీ కపిలతీర్థం, నారాయణవనంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయం, అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం, తిరుమలలోని పాపవినాసం, శిలాతోరణం ప్రాంతాలలో వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నవీ ముంబై, బాంద్రా, యానం, అనంతవరం, ఉల్లందూర్ పేట తదితర ప్రాంతాలలో ఆలయాల నిర్మాణాలపై తాజా పరిస్థితిని నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కె.వి. మురలీకృష్ణ, ఎఫ్.ఏ అండ్ సీఏవో ఓ.బాలాజీ, టివి సత్యనారాయణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 18000 కేసులు



**కడప పెన్ పవర్ జూలై 5 :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 05-07-2025 వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడినది. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. కడప నందు 6, ప్రొద్దుటూరు నందు 3, రాజంపేట నందు 3, రాయచోటి నందు 3, బద్వేల్ నందు 3, లక్కిరెడ్డిపల్లి, రైల్వే కోడూర్, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందల మరియు కమలాపురం కోర్టుల నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేయడం జరిగినది.

జాతీయ లోక్ అదాలత్ లో జిల్లావ్యాప్తంగా 18000 కేసులు పరిష్కరించబడినవి. రూ.14,03,00,338/- మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది.

జాతీయ లోక్ అదాలత్ లో న్యాయమూర్తులు మరియు లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగినది.

**మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది.**

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందులకు గాను న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, పత్రికా సిబ్బందికి, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, రవాణాశాఖ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ అధికారులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ అధికారులకు, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు, పత్రికా విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కు లకు, అగ్రికల్చరల్ అధికారులకు మరియు మిగతా శాఖల అందరికీ గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పకడ్బందీగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఏర్పాట్లు

### ఈనెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లను విజయవంతం చేయండి : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**వైఎస్సార్ కడప పెన్ పవర్, జులై 05 :** ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ హాల్లో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ నిర్వహణ ఏర్పాట్ల పై.. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఎంఈఓలు మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,జూనియర్ ప్రభుత్వ ,ప్రవేటు విద్యా సంస్థల అధ్యాపకులతో వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ ,ఎయిడెడ్ పాఠశాలల్లో,కళాశాలలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని పక్కా ప్రణాళికతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు ప్రతి పేరెంట్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, దాతలు, పూర్వపు విద్యార్థులకు, మీడియా వారికి అందించాలన్నారు.పాఠశాల గదులతో పాటు పరిసర ప్రాంతాల్లో 100శాతం పారిశుద్ధ్య పనులు చేపట్టి పుష్పాలతో పాఠశాలలను సుందరీకరించాలన్నారు. తరగతి గదుల్లోని బోర్డులపై చక్కటి కొటేషన్లు విద్యార్థులతో రాయించాలన్నారు. విద్యార్థులు అందరూ తమ అమ్మ పేరు మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పక్కాగా ఏర్పాట్లు చేయాలని విద్యాధికారులను ఆదేశించారు అలాగే మొక్కలు నాటిన అనంతరం వాటి సంరక్షణ పరిరక్షణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే లీప్ యాప్ ద్వారా రిజిస్టర్ అయిన విద్యార్థులకు గ్రీన్ పాస్పోర్ట్ అందించాలని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని డ్వామా శాఖతో ఎంఈఓ లు సమన్వయంతో చేసుకొని పని చేయాలన్నారు. సమావేశాలకు హాజరైన తల్లిదండ్రులకు, ఆహ్వానితులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం ఆహార పదార్థాలను వడ్డించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరిపి మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ లను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఎఫ్ ఓ సోషల్ ఫారెస్ట్రీ శివ కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్ కుమార్, అగ్రికల్చర్ జెడి చంద్ర నాయక్, మెప్మా పిడి కిరణ్ కుమార్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి,సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, వివిధ జిల్లా శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నెమలిను టౌన్ పోలీసులకు అందించిన శారదా నగర్ వ్యక్తులు



**ధర్మవరం పెన్ పవర్ జూలై 5 :** పట్టణంలోని బత్తలపల్లి రోడ్డు మార్కెట్ యార్డ్ గోడ నుంచి శనివారం సాయంత్రం శారదా నగర్ ఎగరలేక ఎగరే నెమలి కింద పడింది. అక్కడే ఉన్న సరితాన్ షేక్షావలి, షేక్ షేక్షావలి కలిసి ఆ నెమలిని టూటౌన్ పోలీసులకు అందించారు. తదుపరి టూ టౌన్ పోలీసులు ఫారెస్ట్ ఆఫీసర్కు సమాచారాన్ని అందించారు.అనంతరం టూ టౌన్ పోలీసులోని ఏఎస్ఐ బాబయ్య ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అక్కులప్పకు అందజేశారు. తదుపరి వారు మాట్లాడుతూ దారితప్పిన ఈ నెమలిని ఫారెస్ట్ ఆఫీసర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడవిలో వదిలిపెట్టడం జరుగుతుందని తెలిపారు. నెమలిని కాపాడి స్టేషన్ ద్వారా మాకు అందించినందుకు సేక్షావలిను వారు అభినందనలు తెలుపుతూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం 2.0

### ఏపీ జైలు శాఖ ఐజి ఇండ్ల శ్రీనివాసు.ను కమిటీ ఆన్ ఆడిట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్రిజన్స్ చైర్మన్ గా నియమించిన కేంద్రం

### జైళ్లలో అత్యాధునికరణ పనులకు శ్రీకారం, కేంద్ర ప్రభుత్వం పోలీస్, న్యాయవ్యవస్థ జైల్ శాఖ అనుసంధాన ప్రక్రియ





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జూలై 5 :** కేంద్ర ప్రభుత్వం పోలీస్ న్యాయవ్యవస్థ జైల్స్ సౌజన్యంతో ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం 2.0తో కేంద్ర ,రాష్ట్ర జైళ్లలో అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థకు శ్రీకారం వివరాలు తెలియపరిచిన ఆంధ్ర ప్రదేశ్ జైలు శాఖ ఐజి ఇండ్ల శ్రీనివాస్. విశాఖ కేంద్ర కారాగారంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జైళ్లలో సూపరిండెంట్లకు14 లాప్టాప్ 108 కంప్యూటర్లు ప్రింటర్లు స్కానర్లు మంజూరు చేయడం జరిగిందని,జిల్లా,కేంద్ర, మహిళల కారాగారాల సూపరిండెండెంట్ లకు14 లాప్టాప్ లు, కంప్యూటర్లు ఇవ్వడం జరిగిందని, ఖైదీలకు సంబంధించిన సమాచారాన్ని నిక్షిప్తపరిచి సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఎఫైర్స్ కి అనుసంధానం చేయడం జరుగుతుందని సమాచార సౌలభ్యత కోసం వీటిని అనుసంధానం చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఈ ప్రక్రియ ద్వారా సాంకేతికతను పరిపాలనను అనుసంధానం చేసే దిశగా ఈ ఆధునిక ప్రక్రియను వాడుకులోకి తీసుకుని రావడం జరుగుతుందని, తద్వారా సమాచార సేకరణ సమాచార క్రమబద్ధీకరణ సమాచార నిల్వలకు సంబంధించి అత్యంత గోప్యంగా వీటిని ఉంచడం జరుగుతుందని దానికోసం ఈ నూతన అత్యాధునిక వ్యవస్థను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యక్తిగత పూర్తి సమాచారాన్ని పొందుపరచడం అవసరాన్ని బట్టి ఆ వ్యక్తి యొక్క పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడం అవ్వడానికి వ్యవస్థ ఉపయోగపడుతుందని, ఖైదీలు యొక్కప్రతి ఒక్కరి వ్యక్తిగత సమాచారం దేశం మొత్తం అధికారులకు తెలుస్తుందని తద్వారా సమయము సమాచారము అత్యంత వేగవంతంగా చేరవేయడం జరుగుతుంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశం లో రాష్ట్రాలు ఉన్న సీసీ కెమెరాలు వ్యవస్థ వాటి యొక్క పనితీరు మొత్తం కూడా ఎంతవరకు వీటిని వినియోగంలోనికి తీసుకుని వచ్చారు అన్నది కేంద్రం ఆడిట్ కమిటీని వేసింది ఇందులో నలుగురు జైలు శాఖ అధికారులు,ఇద్దరు బి పి ఆర్ డి అధికారుల మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ నివేదిక మేరకు నియమించడం జరిగిందని, కమిటీ ఆన్ ఆడిట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్రిజన్స్ చైర్మన్ ఇండ్ల శ్రీనివాసు ను నియమించింది. ఇందులో 20 రాష్ట్రాలను ఎంపిక చేయడం జరిగిందని ఈనెల 20 నుండి 20 రాష్ట్రాలలో కమిటీ ఐదు నెలల పాటు పర్యటించి ఇదే సంవత్సరం డిసెంబర్ నెలలో నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్, కెమెరా యొక్క క్వాలిటీ ఫిక్సెల్స్ టెక్నికల్గా వాటి యొక్క పనితనం కెమెరా ఎంత పరిధిలో వీడియో క్యాప్చర్ చేయడం జరుగుతుంది అనే అంశాలను, పర్యటనలు ఎంపిక చేసిన జైల్ల నే కాకుండా నిర్ణయం మేరకు వేరే ప్రాంతాలను కూడా ఉన్న జైలను కూడా సందర్శించడం జరుగుతుందని, ముఖ్యంగా ఇ - ప్రీజన్స్ ఇ -సిస్టం పనితీరు క్యాప్చర్ చేస్తున్న డేటా రక్షణ చర్యలు సీసీ కెమెరా పనితీరు మొదలగు అంశాలపై పర్యవేక్షణ ఉంటుందని వీటిలో గ్రేడ్లు ఉంటాయని ఉత్తమ గ్రేడ్ కనబరిచిన జై లను కూడా గుర్తించడం జరుగుతుందని తెలియజేశారు.

## బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**కడప పెన్ పవర్ జూలై 5 :** మహావీర్ సర్కిల్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరుగును. అనంతరం ఉదయం 10:00 గంటలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు బాబు జగ్జీవన్ రామ్ గారి చిత్రపటానికి మరియు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి , మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మేయర్ సురేష్ బాబు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొంటారు.

## గంజాయి పట్టివేత : అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

**కడప పెన్ పవర్ జూలై 5 :** కడప నగరం నందు అసిస్టెంట్ కమిషనర్ అయిన చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ అయినా ఏం నీలకంఠేశ్వరారెడ్డి వారి సిబ్బంది మరియు స్టేషన్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను వారి వద్ద నుండి 1100 గ్రాముల ఎండు గంజాయిని రెండు ద్విచక్ర వాహనములను మరియు వారి మొబైల్ ఫోన్లను సీజ్ చేయడం జరిగింది. తదుపరి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం అయింది.

## ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీరియస్ సర్క్యులర్ విడుదల



**అమరావతి పెన్ పవర్ జూలై 5 :** రాష్ట్రం లోని జడ్జెస్, మెజిస్ట్రేట్స్ సుప్రీం కోర్టు గైడులైన్స్ ప్రకారం కేసులు విచారణ చేపట్టాలని, తప్పితే కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ క్రింద సంబధిత జడ్జి పై చర్యలు తీసుకుంటామని ఆదేశం! పోలీసులు వివిధ సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసిన వాటిని రూల్స్ పాటించారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది! 14 రోజులు రిమాండ్ విధించే ముందు సంబధిత పోలీస్ అధికారుల విచారణ రూల్స్ పాటించారా లేదా సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ లో ఉందా లేదా అనేది చూడాలి.! సోషల్ మీడియా పోస్టుల కేసుల్లో రిమాండ్ పై ఆదేశాలు.! రిమాండ్ విధించేటప్పుడు మార్గదర్శకాలు పాటించాలి. చాలాకేసుల్లో సుప్రీంనిర్దేశించిన సూత్రాలు పాటించడం లేదు.! తప్పని సరిగా జడ్జెస్ గైడ్ లైన్స్ ప్రాకారం కేసుల మీద విచారణ జరపాలి.-ఏపీ హైకోర్టు.

# డాక్టర్ ల సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్‌ల సమస్య తీర్చిన ప్రభుత్వం

## పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్

**కర్నూల్ పెన్ పవర్ జూలై 5 :** జిల్లాలోని డాక్టర్ల సర్టిఫికెట్ రెన్యువల్, రీ-రిజిస్ట్రేషన్ మరియు ఇతర సేవల కొరకు జిల్లాలోనే రిజిస్ట్రేషన్ యూనిట్ ఏర్పాటు చేసి డాక్టర్ ల రిజిస్ట్రేషన్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిందని పరిశ్రమలు , వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజ్ కాంప్లెక్స్ లో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన డాక్టర్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ యూనిట్ ను పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర మఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ గారు ఎల్లప్పుడు ప్రజలకు మంచి చేయాలి అని నూతనగా ఆలోచించే స్వభావం కలవారు.దానిలో భాగంగా ప్రజలకు 500 సర్వీసులతో వాట్సఅప్ గవర్నెన్స్ ను అభివృద్ధి చేశారు. అదేవిధంగా మన రాష్ట్రంలో ఉన్న డాక్టర్లు వారి సర్టిఫికేట్ ల రిజిస్ట్రేషన్ లు,రీ- రిజిస్ట్రేషన్ లు మరియు ఇతర సేవలను ఎక్కడికక్కడ జిల్లా లో చేయించే ఏర్పాట్లు చేసినారు.గతంలో రిజిస్ట్రేషన్ల కొరకు విజయవాడకు వెళ్ళవలసి వచ్చేది, విజయవాడ కు వెల్లడము,ఏదైనా సర్టిఫికెట్ తక్కువ అయితే తిరిగి వెనక్కి రావడం చాలా శ్రమతో మరియు ఖర్చు తో కూడుకున్న వ్యవహారం, డాక్టర్ తమ విలువైన సమయం వెచ్చించడం 60 సంవత్సరాలు పై బడ్డ డాక్టర్లకు ఇంకా కష్టంగా ఉంటుంది.ఆ కష్టాల నుండి డాక్టర్లను విముక్తి చేశారు.ఇప్పుడు జిల్లా కేంద్రంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. అందుకు మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మరియు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అన్నారు. ఇటువంటి సేవలను డెంటల్ డాక్టర్లకు కూడా వర్తింప చేసే చర్యలు చేపట్టాలని చైర్మన్ ను మంత్రి కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు (ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ )మాట్లాడుతూ... జిల్లా స్థాయిలోనే రీ-రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ చేయించే సేవలను తీసుకుని



వచ్చామని , ప్రతి శనివారం, ఆదివారం ఈ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గతంలో 40 వేల నుండి 50 వేల వరకు ఉండే రీ-రిజిస్ట్రేషన్ ను ఇప్పుడు 75 సంవత్సరాలు పైన ఉన్న వారికి 6 వేల రూపాయలకు, 75 సంవత్సరాలు లోపల ఉన్నవారికి 8 వేల రూపాయలకు రిజిస్ట్రేషన్ చేయబడుతుందని తెలియజేశారు. ఐదు సంవత్సరాల కాలం కంటే మూడు నెలల ముందు గా కూడా రెన్యువల్ చేసుకోవచ్చని, బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు ఆన్లైన్ లోనే రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ...చాలామంది డాక్టర్లు రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకొనకుండా ప్రాక్టీస్ లో ఉంటారని, దీనివల్ల వారి వైద్య వృత్తికి ఇబ్బందులు కలుగుతాయని , ఇప్పుడు విజయవాడకు వెళ్లకుండా కర్నూల్లోనే రెన్యువల్ మరియు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నందున డాక్టర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ విధమైన ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని మెడికల్ కౌన్సిల్ను అభినందించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరి ఇండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ లు మాట్లాడుతూ... డాక్టర్లకు ఈ విధమైన మంచి అవకాశం కల్పించిన మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశానికి కళాశాల ప్రొఫెసర్ లు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో వున్నా ఫీజు రియింబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి

## ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వేంపల్లి పాలిటెక్నిక్ కళాశాల నందు ఆందోళన : డి. యం. ఓబులేసు యాదవ్

**కడప పెన్ పవర్ జూలై 5 :** రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఇంటర్, ఎంబిఏ, ఏంసిఏ కోర్సు లకు రావాల్సిన పెండింగ్ ఫీజు రియింబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లి లోని పాలిటెక్నిక్ కాలేజీ లో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీనివలన వేలాది మందికి వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న,చదువుతున్న విద్యార్థులకు తీవ్ర మనోవేదనకు గురించేసిందని, కాలేజీ లనుండి తీవ్ర ఒత్తిడి కి గురై చదువులు మధ్యలో ఆపేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇక జీ. ఓ. నెంబర్




77 వలన ప్రయివేట్ కాలేజీ లల్లో చదువుతున్న పీజీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్ మెంట్ లేకుండా చేయడం తో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయడం జరిగిందని, తక్షణమే ఈజీ.ఓ.ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాలకు సరైన నిధులు విడుదల చేయకపోవడం తో చాలా పాలిటెక్నిక్ కాలేజీలో సరైన ప్రాక్టికల్ మిషనరీస్ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నరన్నారు. అదేవిధంగా నియోజకవర్గనికి ఒక పాలిటెక్నిక్ కళాశాల ఉండడం వలన వాటిలో లెక్చరర్స్ లేక సరైన బోధన జరగడం లేదని తక్షణమే అధ్యాపకులను నియమించాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అనుష్ఠానం-తోటివారిని సంతోషపెట్టేదో, సాటివారి కన్నీరు తుడిచేదో - ఏదైనా అనుష్ఠానమే!

**కడప పెన్ పవర్ జులై 5 :** నేను ఎప్పుడు "అనుష్ఠానానికి" కూచున్నా సరిగ్గా టాయిలెట్స్ కడిగే అమ్మాయి అప్పుడే వస్తుంది. మనిషి బక్కపలచగా నీరసంగా ఉంటుంది. జక్కంపూడి నుంచి రానూపోనూ 50/-ఇచ్చి ఆటో లో వస్తుంది. ఎన్నిసార్లు చెప్పినా మంగళ, శుక్రవారాల్లోనే వస్తుంది. మొదట్లో కొంచెం విసుక్కున్న మాట నిజమే! కానీ ఆ అమ్మాయికి ఆకలి, అరడజను ఆడపిల్లల ఆలనా పాలనా తప్ప మన సెంటిమెంట్ పట్టదు అని గ్రహించా. నాలాంటి వారు నలుగురు పని చెబితేనే ఆరోజు గడుస్తుంది ఆ ఇంటిల్లిపాదికి. ఆటో చార్జీలు, దాన్లో మళ్ళీ ఆసిడ్ బాటిల్, ఫినాయిల్ కి పెట్టుబడి పోగా మిగిలే ఏ యాభయ్యో, వందో రూపాయల కోసం మనం అసహ్యించుకునే పనిని ఆప్యాయంగా చేస్తుంది. అటువంటి అమ్మాయిని 'ఇవ్వాళ శుక్రవారం.. పైగా పూజ మధ్యలో ఉన్నా..రేపురా' అని ఎలా అనగలను? అలా అంటూ.."అన్తశ్చరతి, భూతేషు, గుహాయామ్, విశ్వమూర్తిషు," అంటూ మననం చేస్తుంటే పూజిస్తున్న దేవుడు తెల్లబోడూ? 'చదువుతున్నది ఏమిటి, చేస్తున్నది ఏమిటి?' అని అడిగితే మొహం ఎక్కడ పెట్టుకోను? అందుకే పూజ ఆపి ఆ అమ్మాయి పని అయి పంపాకే శేషానుష్ఠానాన్ని సాగిస్తున్నా. ఇక్కడే నాకు సందేహం వచ్చింది! అసలు "అనుష్ఠానం" అంటే ఏమిటని!? అనుష్ఠానం ఒక పవిత్రమైన పదం. పదం ఎంత గంభీరమో! దాని అర్థం కూడా అంతే గూఢం. భగవంతుడికి సంబంధించిన పదం కాబట్టి దీని అర్థం విలక్షణంగానూ విస్తృతంగానూ ఉంటుంది. "ఫలానాలిలా చేస్తేనే అనుష్ఠానం" అని గిరి గీసి చెప్పటానికి లేకుండా "గిరి" అంత ఉన్నతమైన విలువ కలది. ఒక్క మాటలో చెప్పాలంటే భగవంతునిలానే అనిర్వచనీయం. సమాజహితం కోసం ఏకాగ్రత తో చేసే అనుష్ఠానం, ధ్యానం లేదా తపస్సు ఒక దృఢమైన సంకల్పశక్తి గా లోకకల్యాణానికి ఎలా మారుతుందో మహానుభావుల చరిత్ర చూస్తే తెలుస్తుంది. మరి మనం అలా చెయ్యాలంటే అంత మానసిక శారీరక తుష్టి పుష్టి మనకి ఉందా? అంత ఏకాగ్రత మనం సంపాదించు కోగలమా? ఖచ్చితంగా నాలాంటి వాడు చెయ్యలేడనే చెప్పాలి. మరి సమాజానికి మన అనుష్ఠానం ఉపయోగపడటం ఎలా?

ఎలా అంటే, "మన స్థాయిలో సమాజానికి" ఉపయోగపడేలా మనం చేసే ప్రతీ చర్యా అనుష్ఠానమే. అలాంటి అనుష్ఠానాలు అవలోకించి చూస్తే అడుగడుగునా బోలెడు. ఉదాహరణకు జోరున వర్షం పడుతోంది. పక్కవాటా వాళ్ళు లేరు. కానీ వారు ఆరేసిన బట్టలు వానలో తడుస్తున్నాయి. వెంటనే మీరు అవి తీసి మడతబెట్టి రాగానే ఇస్తే వాళ్ళు ఎంత ఆనందిస్తారో కదా? తెల్లవారుజామున మీరు జిమ్ కని బండి మీద వెళ్తున్నారు. ఇంతలో ఒక పెద్దమనిషి చేతిలో సూట్ కేస్ తో అటూ ఇటూ ఆదుర్దాగా చూస్తున్నాడు. మీకు అర్థం అయ్యింది! ఆయన స్టేషన్ కి వెళ్లాలని. కనుచూపుమేరలో ఆటో కనపడటం లేదు. పోనీ మీ పని అంత అర్జంట్ కానప్పుడు ఆగి స్టేషన్ దగ్గర దింపితే ఆయనకి ఎంత ఊరట!! రైలు లో కూచొని "దైవం మానుష రూపేణా"!! అన్నట్లు "దేముడిలా అతనెవరో దించాడు కాబట్టి సరిపోయింది లేకపోతే ఏమయ్యేది?" అన్న ఆయన కృతజ్ఞతా తలంపు మీకు ఎంత పెద్ద దీవెన? ఇలాంటివన్నీ అనుష్ఠానాలు కాదూ! పండగ వచ్చింది. లాక్ డౌన్ మూలంగా పక్కవారు ఎక్కడో ఉండిపోయారు. పండగ రోజు కాస్త ముగ్గు, నాలుగు మామిడాకులు వాళ్ళ గుమ్మం ముందు ఉంచితే మన బతుకు పచ్చ తోరణం అవ్వదూ! మన నోటికి భయపడి జోరు వర్షం లో కూడా మానకుండా వచ్చే పనిమనిషికి





మనం తాగే కాఫీ లాంటిది ఇస్తే ఆ అమ్మాయి లో కలిగే అల్ప కృతజ్ఞత మనకి అనల్పసంతోష హేతువవ్వదూ!! మన ఇంట్లో మనం తినటం కన్నా పక్క ఇంట్లో భోజనానికి వెళ్ళినప్పుడు వాళ్ళు ఎంత సంతోషంగా వడ్డిస్తారో అలాగే మన ఇంట్లో భగవానుడు.. పక్క ఇంట్లో వాడికి పెడితే అంతగానూ సంతోషపడతాడు కదా!

భార్య శ్రద్ధగా వంట చేసి పెడుతుంటే మెచ్చుకోవడం, పక్కవాడి తులసిమొక్కకి కాసిని నీళ్లు పోయడం, వాళ్ళ కుక్కకి అన్నం పెట్టడం.. ఇలా ఎన్ని రకాల అనుష్ఠానాలని! చీరల షాపులో పనిచేసేవారికి సరైన పౌష్టికాహారం ఎక్కడ ఉంటుంది? పైగా షాపులో ఉన్నంతసేపు అలా నుంచొని ఉండాల్సిందే! డజన్లకొద్దీ చీరలు తీయిస్తూ, ఆ సేల్స్ గర్ల్ సహనాన్ని పరీక్షిస్తూ, ఒక చీర కనీసం జాకెట్ కూడా తీసుకోకుండా వెళ్ళేవాళ్ళు ఎందరో? ఆ అమ్మాయికి "అమ్మే తెలివితేటలు లేవని" ఓనర్ తిట్టే అరుపులు మన చెవికి వినపడవు. గతిలేని ఆ అమ్మాయి కన్నీరు మనకి కనపడదు. ఇది గ్రహించని మనం చేసే పూజకి పరమార్థం ఉందంటారా? ఎక్కే గుమ్మం దిగేగుమ్మం గా ఉద్యోగాలు చేసేవారు.. ఉంటారు. ఉదాహరణకు కేబుల్ టీవీ వాళ్ళుబిల్లు కోసం మూడంతస్తులు ఆయాసపడి ఎక్కివస్తే "మళ్ళీ రండి" అని విసుక్కోకుండా వెంటనే కట్టేస్తే ఆ చిరుద్యోగి.. "అందరూ ఇలా ఉంటే ఎంత బాగుండు!" అనుకోడూ!! అతనికి లభించిన ఆ చిన్నసాంత్వన భగవంతుడు మీ వైపు చూసేలా చెయ్యదూ? ఒక చిన్న సైకిల్ మూలంగా మొత్తం ట్రాఫిక్ ఆగిపోతే ఎవరికి వారు నామోషీకి పోయి కార్లు, బళ్ల మీద బిర్రబిగుసుకుని కూచోకుండా ఆ సైకిల్ మీరు జరిపితే కొంతైనా సంస్కారం ఉన్న వ్యక్తులు మీ వైపు కృతజ్ఞతతో చూసే చూపు మీ వైటల్ ఎనర్జీ ని రెట్టింపు చెయ్యదూ? ఏదో వీక్ ఎండ్ లో మీరు ఏపుణ్యక్షేత్రమో వెళ్తున్నప్పుడు మీ కుటుంబసభ్యులతో బాటు ఏ బీదవారినో ఒకర్ని తీసుకెళ్లి దర్శనం చేయిస్తే గుళ్లో దేముడు బోల్డు సంతోష పడిపోడూ? మన ఇంట్లో పూచినవో, కాచినవో నలుగురికి మనస్ఫూర్తిగా అందిస్తే, ఆ చెట్లు మరింత ఇవ్వడానికి సిద్ధమవుతాయట. వాటి సగటు ఆయుర్దాయం కూడా పెరుగుతుందని చదివా. మనఇంటి పూలతో నలుగురూ చేసే పూజ, మన కాయలతో చేసే వైద్యమో, నైవేద్యమో!! ఎంత మంది చేస్తే అంత అనుష్ఠానం మనం చేస్తున్నట్లు కాదూ! నేను చూస్తూ ఉంటా.. చాలామంది ఇంట్లో చెత్త ని రోడ్డు మీద ఎవరూ చూడట్లేదన్న భ్రమలో ఇంకోరి ఇంటిముందు పారపోసేస్తూంటారు. కొంతమంది చెత్త బుట్టలో వేస్తారు కానీ దాన్లో కుమ్మరించడం వలన తీసుకెళ్లే పారిశుధ్య కార్మికులకు ఎంతో అవస్థ. కొన్ని చెత్తబుట్టలు చిల్లులు పడినా మార్చరు.. వాటినుంచి చెత్తరాలుతూ, కారుతూ ఉంటుంది. తినడానికి, సినిమాలకి ఖర్చు పెడతాం కానీ చెత్త బుట్ట మంచిది కొననే కొనం. పాపం ఆకార్మికుడు మనసు కష్టపెట్టుకున్నా మనకి చెప్పే ధైర్యం అతనికి ఉండదు. చెత్త నంతటినీ క్యారీబాగ్స్ లో పెట్టి వేస్తే తీసుకెళ్లే అతనికి ఎంత సౌకర్యంగా ఉంటుంది!! ఇలాంటి చిన్నసామాజిక బాధ్యతని గుర్తించి మన వంతు కర్తవ్యాన్ని మనము నిర్వహిస్తే అంతకన్నా పెద్ద 'అనుష్ఠానం' ఇంకేముంటుంది? చివరిగా ఒక ఆహ్లాదకరమైన అనుష్ఠానాన్ని చెబుతా. ఆ మధ్య "హంసల దీవి" కి వెళ్ళా..! నాకు తెలుసు అక్కడ బెస్తవారి పిల్లలు ఉంటారు. వాళ్ళకి చేపలు, సముద్రం తప్ప వేరే లోకం తెలియదు. కార్లు, బైకులు వేసుకొచ్చి సముద్రంలో దిగి ఆటలాడుతూ తింటూ, తాగుతూ ఉండే మనుష్యులని ఆశ్చర్యంగా ఆశగా చూస్తూ దూరంగా ఉంటారు. నేను వారికి సర్ ప్రైజ్ ఇద్దామని "కొన్ని వేఫర్లు..కొన్ని మిల్క్ డైరీ చాకలెట్స్ తీసుకెళ్లి పిలిచా" అవి చూపిస్తూ. ముందు రామంటూ అడ్డంగా తల ఊపుతూ పారిపోయారు. తర్వాత దూరంగా నన్ను చూస్తూ నిలబడ్డారు. ఒకళ్లిద్దరు గుడిసె లో దూరి వాళ్ళమ్మకి చెప్పినట్లున్నారు. ఆవిడ తల బైట పెట్టి నన్ను చూసి ఏమనుకుందో ఏమో!! వాళ్ళకి ఏదో చెప్పింది. అప్పుడు వాళ్ళు భయం భయంగానే నాదగ్గరకి వచ్చారు. అప్పుడు నేను చాకలెట్స్ ఇస్తూ వాళ్ళ వివరాలు కనుక్కుంటూ కబుర్లు చెప్పా. ఆ వేఫర్స్, చాకలెట్స్.. వాళు ఎప్పుడూ తినలేదట!.ఎవరూ ఇవ్వలేదట!! అసలు వాళ్ళని చేరదీసి ఇలా పలకరించింది లేదనే చెప్పారు. మాటల్లో సముద్రం గురించి ఎన్ని విషయాలు చెప్పారో?? ఆశ్చర్యం వేసింది. "అలలు, వారి వలలు, చేపలు, తెరచాపలూ, బోటులు, కడలి అటు పోటులూ". ఇలా మా మధ్య స్నేహం కుదిరిన ఆ గంట అలా అలలా జారిపోయింది.. నా హృదయం అల జారిన మెత్తని ఇసుకగా మారిపోయింది.

కొందరు ఆ చాక్ లెట్స్ కాగితాలు దాచుకున్నారు జేబుల్లో. ఆడపిల్లలయితే నెమ్మదిగా తింటూనే ఉన్నారు. చెలియల కట్ట దాటిన ఆ చిన్నారుల స్వచ్ఛ దరహాస తరంగాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పరుగున వెళ్లి వాళ్ళు దాచుకున్న గవ్వలూ, ఆల్చిప్పలు, నత్తగుల్లలు.. ఇత్యాదివి పోటీపడి చూపించారు. "అచ్చంగా నన్ను తీసుకోమని" ఒకరిద్దరు కోరారు కూడా. నాకు ఏదో ఒకటి ఇవ్వాలన్న ఆ "శైశవతపన" చూస్తే ఎంత ముచ్చటేసిందో!! నేనిచ్చిన చిన్న కానుక్కే వాళ్ళ మొహాలు లైట్ హౌస్ లా మారి వింతకాంతిపుంజం విరబూసి జీవితం పట్ల నా కున్న దృక్కోణానికి దిశానిర్దేశం చేసాయా? అనిపించింది. చాలు ఈ జీవితానికి!! ఆ పసిమనసుల సమక్షంలో నేను చేసుకున్న ఈ "చిన్ని అనుష్ఠానం". ఇలా చేసే "అనుష్ఠానాలు" కాకుండా కొన్ని చేయకుండా ఉంటే "అనుష్ఠానాలుగా" మారేవి ఉన్నాయి. ఉదాహరణకు తన దారిన తాను పోతున్న కుక్కనో, పందినో ఊరికే కొట్టడం, నడుస్తున్న వారి మీద రోడ్డుపై నిలిచిన వాననీళ్లు పడేలా బళ్లు వేగంగా నడపడం, అందుతున్నాయికదా అని అనుమతి లేకుండా పక్కవారి పూలు, కాయలు కోసేయడం ఇలాంటివి చేయకుండా ఉంటే 'అనుష్ఠానం' చేసినట్లే!! ఇలా రాస్తూ పోతే ఎన్ని రకాల అనుష్ఠానాలైనా చెప్పచ్చు, చేస్తూ పోవచ్చు. తోటివారిని సంతోష పెట్టేదో, సాటివారి కన్నీరు తుడిచేదో ఏదైనా "అనుష్ఠానమే"

**మీరూ ఆలోచించండి... ఆరంభించండి.**

**శరీరానికి ఎంత కాంతి, మనసుకి ఎంత శాంతి!**

**సర్వం శ్రీకృష్ణార్పణమస్తు**

**లోకా సమస్తా సుఖినోభవన్తు**

జూలై 9 సార్వత్రిక సమ్మెను ...

## జయప్రదం చేయాలని ఐక్య కార్మిక సంఘాలు పిలుపు

యువతపై విశ్వాసం-దేశాభివృద్ధికి ఏబీవీపీ ఆకర్షణ : హరీష్ బాబు



**కడప పెన్ పవర్ జూలై 5 :** జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ యుటియుసి జిల్లా నాయకులు సుబ్బరాయుడు, టీయుసి నాయకులు రమణయ్య లు పిలుపునిచ్చారు. శనివారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడప నగరంలోని స్థానిక సెవెన్ రోడ్స్ దగ్గర ఉన్న ఆర్డిఓ ఆఫీస్ దగ్గర నుండి బైక్ ర్యాలీ పెద్ద ఎత్తున ప్రారంభించి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, వరకు బైక్ ర్యాలీ ముగింపు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని, లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.బ్రిటీష్ కాలం నాటి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల పని గంటలను సైతం పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. 73 షెడ్యూల్లోని కార్మికులు మునిసిపల్ అంగన్వాడి ఆశా తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక చిరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వీరి సమస్యలపై నిరసన తెలుపుకొనే అవకాశం కోల్పోతారని,ఇది ఒక రకంగా దేశంలో నిర్బంధ నిరంకుశ విధానాలను అవలంభించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటో హమాలి వీధివిక్రయ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెపుతూ ఆదాని అంబానీ వర్గాల వారికి పన్నులు తగ్గిస్తూ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన మోడీ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు.ఈ సమ్మె జయప్రదానికి జిల్లాలో అన్ని రంగాల కార్మిక వర్గాలను సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు రెడ్డి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నాయకుల తారక రామారావు, నరసింహ, జనార్ధన్, సాయి, వెంకటేష్, వెంకీ, వినయ్, వెంకటేష్, మధు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం నాయకులు రవి, ప్రకాష్, శ్రీరాం, ఆనంద్, పవన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## 10న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్




**తిరుపతి పెన్ పవర్ జూలై 5 :** జిల్లావ్యాప్తంగా జూలై 10 వ తారీఖున టాలెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తు న్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాత్రికేయు లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది విద్యాశాఖ తరఫున మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్రవ్యాప్తంగా జూలై 10వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ఇన్చార్జి మినిస్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.తిరుపతి జిల్లాలో కూడా సర్పంచ్ మొదలుకొని ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు (ప్రైవేట్, ప్రభుత్వ), జూనియర్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు.ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం భోజనం సమయం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు తల్లిదండ్రులు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనాన్ని కూడా చేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భోజనం పై తల్లిదండ్రుల నుండి అభిప్రాయాన్ని కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం మెనూ కూడా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు హెూలీ స్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేయడం జరుగుతుందన్నారు.ఇప్పటికే జిల్లాలో సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ లను అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే పిల్లలు ప్రభుత్వం అందించిన యూనిఫామ్ ధరించి పాల్గొంటారన్నారు. తల్లికి వందనం కింద తల్లుల ఖాతాలో మొత్తాలను ఇదివరకే జమ చేయడం జరిగిందన్నారు. ఆధార్ అప్డేట్ చేయని వారికి పదో తారీకు లోపు అప్డేట్ చేసుకుంటే సదరు మొత్తాలు వారి ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆధార్ తదితర సాంకేతిక సమస్యలతో జమ కాని వారికి మరో రెండు,మూడు వారాల్లోపు వాటిని సరిచేసి వారి ఖాతాల్లో సంబంధిత మొత్తాలను జమ అయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంతో పాటు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు "ఏక్ పేడ్ మాకే నామ్ పర్"అంటే తల్లి పేరుతో ఒక మొక్కను కూడా అందించి నాటడం జరుగుతుందన్నారు. ఇందుకోసం సామాజిక అటవీ విభాగం, విద్యా శాఖ సమన్వయంతో అన్ని పాఠశాలలకు మొక్కలను సరఫరా చేయడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించి వారి ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల తో కూడా రేపు, ఎల్లుండి చర్చించి వారిని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేస్తున్నామన్నారు. వారికి ఎక్కడైనా స్థల సమస్య ఉంటే, అలాంటివారు మూడు నాలుగు పాఠశాలలు, కాలేజీలు కలిసి ఒక స్థలాన్ని ఎంపిక చేసి కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు కూడా తాము అనుమతిస్తున్నా మన్నారు. తల్లిదండ్రులే ఒక దరఖాస్తును విద్యార్థుల వివరాలతో పూరించి పంపించేలా వినూత్నంగా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యార్థులు స్వయంగా తల్లిదండ్రులను ఆహ్వానిస్తారన్నారు. ప్రతి పాఠశాలలో జరుగుతున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ కూడా చేస్తున్నామని,ఇందుకోసం 30 సెకండ్ల వీడియోక్లిప్, మూడుఫోటోలు అప్లోడ్ చేసేలా డాక్యుమెంట్ చేసి, రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా విద్యాశాఖ ప్రణాళిక రచించిందన్నారు.ఇందుకు సంబంధించిన ట్రైల్ రన్ కూడా 8,9వ తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి విద్యాశాఖ ఒక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి స్కూల్ వద్ద రెవిన్యూ, పోలీస్ వారితో బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్ ను చాలా వినూత్నంగా చేపడుతున్నామని ఆయన తెలిపారు.

# తుడా టవర్స్‌లో ఫ్లాట్లు కొనండి

## - శుభం బన్సల్ వైస్ చైర్మన్, తుడా



**తిరుపతి పెన్ పవర్ జులై 5 :** తిరుపతి నడిబొడ్డున సుమారు 300 కోట్లతో సకల సౌకర్యాలతో నిర్మిస్తున్న తుడా టవర్స్ లో ఫ్లాట్లు కొనుగోలు చేయాలని, సకాలంలో పూర్తి చేసి వినియోగదారులకు అందుబాటులో వుంచుతామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ శుభం భన్సల్ విజ్ఞప్తి చేశారు. తుడా టవర్స్‌ను సందర్శించి కాంట్రాక్టర్ KPC ప్రాజెక్ట్ లిమిటెడ్ వారికి మరియు తుడా ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. 3.60 ఎకరాల్లో సుమారు 7 లక్షల 65 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామన్నారు. ఈ టవర్స్‌లో 2BHK-40,3BHK138,4BHK –28 రెసిడెన్షియల్ ఫ్లాట్లుతో బాటు గ్రౌండ్ ఫ్లోర్లో 10 ఫస్ట్ ఫ్లోర్లో 21 కమర్షియల్ ప్లాట్లు వుంటాయన్నారు. తుడా కార్యదర్శి డాక్టర్ N.V శ్రీకాంత్ బాబు,SE కృష్ణారెడ్డి, EE రవీంద్రయ్య సలహాదారుడు రామకృష్ణారావు పాల్గొన్నారు.

# ఎర్రగుంట్ల హత్య కేసును ఛేదించిన పోలీసులు




**కమలాపురం పెన్ పవర్ జూలై 5 :** ఈ నెల1వ తేదీ యర్రగుంట్ల మార్కెట్ యార్డులో జరిగిన హత్య కేసును చేదించిన ఎర్రగుంట్ల పోలీసులు. ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి వెంకటేశ్వర రావు. హత్య గావించబడిన షెక్షావల్లి కి విధవరాలు అయిన చెల్లెలి తో సహజీవనం చేస్తున్న ముద్దాయి జాఫర్ హుస్సేన్. వద్దని మందలించిన షెక్షావలి. కక్ష పెంచుకొని అంతమొందించాలనుకున్న జాఫర్ వల్లి. పథకం ప్రకారం యర్రగుంట్ల మార్కెట్ యార్డుకు తెచ్చి పీకల్లోతు తాపించి బండరాళ్లతో కొట్టి చంపిన జాఫర్ వల్లి. కేసునమోదు చేసి ముద్దాయిని ప్రొద్దుటూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు. ముద్దాయిని మీడియా ముందు ప్రవేశపెట్టిన డిఎస్పి వెంకటేశ్వర రావు.

# రాయలసీమ వర్కింగ్ కమిటీ చైర్మన్.. నేసే జాన్ పాల్..


IDENTITY CARD
Membership No: HRPCI/KDP/01/25
HUMAN RIGHTS PROTECTION COUNCIL OF INDIA
Regd No.96/2016
Govt of India Reg: Udyog Aadhaar AP03D0014219
Govt of India Reg: NITIAAYOG GOVT of INDIA Unique ID: AP/2017/0170541
An ISO Certificate of Registration (10002:2014)
Life Member In Indian Red Cross Society
Valid upto: 25/09/2026
Name : NESE JANPAL,
Designation : Regional Working Committee Chairman, Rayalaseema
Address : D.No:1-9-109,Rajeev Nagar, Colony,Pulivendula YSR Kadapa District Pin Code: 516390,A.P
: Blood Group :AB' +ve ,
: Phone :+ 91- 9494779513
PRASANNAKUMMAR TALLURI
Holder Signature
Issuing Signature National Chairman

**పులివెందుల పెన్ పవర్ జూలై 5 :** హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ చైర్మన్ డా.తాళ్లూరి ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు కడప జిల్లా పులివెందుల నియోజకవర్గానికి చెందిన నేసే జాన్ పాల్ గారిని కడప మరియు అన్నమయ్య జిల్లాలలో అతని సేవలు దృష్టిలో పెట్టుకుని కడప అన్నమయ్య జిల్లాల చైర్మన్ డేవిడ్ కళ్యాణ్ రాజు, మరియు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి పర్యవేక్షణలో అన్నమయ్య మరియు కడప జిల్లాలలో అతని సేవలను గుర్తించి పులివెందుల చైర్మన్ నేసే జాన్ పాల్ కు పదోన్నతి కల్పిస్తూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ డా తాళ్లూరి ప్రసన్నకుమార్ రీజినల్ వర్కింగ్ కమిటీ చైర్మన్ గా ఉత్తర్వులు జారీ చేసినట్టు కడప అన్నమయ్య జిల్లాల చైర్మన్ డేవిడ్ కళ్యాణ్ రాజు తెలియజేశారు. నేసే జాన్ పాల్ రీజినల్ వర్కింగ్ కమిటీ చైర్మన్గా నన్ను నియమించినందుకు మొదట నేషనల్ చైర్మన్ కు, డేవిడ్ కళ్యాణ్ రాజుకు, తన తోటి హ్యూమన్ రైట్స్ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ, రాబోయే రోజులలో మన సంస్థకు మంచి పేరు తెచ్చే విధంగా అనేక కార్యక్రమాలు, నిర్విరామముగా నిర్వహిస్తానని, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చే విధంగా తన వంతు శక్తి వంచన లేకుండా కృషితో కష్టపడతానని ప్రత్యేకంగా నేషనల్ చైర్మన్ డా. తాళ్లూరు ప్రసన్నకుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# అంబరాన్నంటిన బుక్కా సంబరం



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం బుక్కా సంబరం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాస జాతర మహెూత్సవాల్లో భాగంగా జాతర ప్రారంభమైన రెండవ గురువారం రాత్రి అమ్మవారికి కుంభం వేసి ఆలయాన్ని మూసివేస్తారు. శనివారం ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం బుక్కా సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గరగ నృత్యాలు, మేళతాళాలతో నిర్వహించిన ఈసంబరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# జూలై 10వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ : కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, పెన్ పవర్ జులై 05 : జిల్లావ్యాప్తంగా జూలై 10 వ తారీఖున టాలెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత ఏడాది విద్యాశాఖ తరపున మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్రవ్యాప్తంగా జూలై 10వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ఇన్చార్జి మినిస్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంజరుగుతుందన్నారు. జిల్లాలో కూడా సర్పంచ్ మొదలుకొని ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు (ప్రైవేట్, ప్రభుత్వ), జూనియర్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంద న్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు.ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమైమధ్యాహ్నం భోజనం సమయం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యనూ అందించడానికి విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో జూలై, 10న మెగా పిటిఎం2.0 కార్యక్రమం నిర్వహణ. పిల్లల ఉచిత మరియు నిర్బంద విద్యాహక్కు చట్టం–2009, జాతీయ విద్యావిధానం–2020, విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం ముఖ్యంగా తల్లితండ్రుల పాత్ర మెగా పిటిఎంలో కీలకమని, మెగా పిటిఎం ద్వారా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి వేదికగా పనిచేస్తోందన్నారు. తల్లితండ్రులకు వారి పిల్లల విద్యా పురోగతి, ప్రవర్తన సామజిక సమస్యల గురించి అవగాహన చేసుకోవడానికి మెగా పిటిఎం దోహద పడుతుందని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో ఒక రోజు మెగా పేరెంట్–టీచర్ మీటింగ్లను వేడుకగా నిర్వహించాలన్నారు. మెగా పి టి ఎం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వారధి, తద్వారా ప్రతి పిల్లవాడికి ఫలితాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులుకలిసిపనిచేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. భారతదేశంలో మొట్ట మొదటి సారి డిసెంబర్ 7, 2024న జరిగిన బృహత్ కార్యక్రమం మెగా పిటీఎం. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 2492 ప్రభుత్వ పాఠశాలల్లో మంది విద్యార్థులు, 2,54,310 మంది తల్లిదండ్రులు 1,13,911 మంది పూర్వ విద్యార్థులు, 1190 మంది 21029 ప్రజా ప్రతినిధుల పాల్గొన్నారు., ఇతరులు 1438 అంతేనా ఇలాంటి కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నాయి. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమగ్ర పురోగతి కార్డులను అందిస్తారు. తద్వారా ప్రతి బిడ్డ విద్యా పురోగతి తెలుసుకుంటారు.

ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సమావేశంలో పాఠశాల విద్యాపరమైన పనితీరు, మౌలిక సదుపాయాలు, కార్యాచరణ ప్రణాళికలను తెలియజేస్తారు. సరదా కార్యకలాపాలు, ఆటలు ద్వారా కార్యక్రమంలో పాల్గొన్న అందరి తల్లిదండ్రుల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించవచ్చునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అధిక మొత్తంలో నిధులను వెచ్చిస్తోందని తెలిపారు. డీఎస్సీ ద్వారా జిల్లాకు 1,500 నుండి 1,600 మంది వరకు ఉపాధ్యాయులు రానున్నారని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ ను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కొన్ని ఎస్సీ ఎస్టీ హాబిటేషన్స్‌ని ప్రాథమిక పాఠశాలలను సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లోవిలీనం చేయడం పట్ల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని, విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవడానికి అవసరమైన ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకున్న కీలక మార్పులు కారణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరుగుతున్నదని భవిష్యత్తులో విద్యా వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుటుంబ ఫోటో బూత్లు, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో మొక్క నాటడం) భాగంగా గ్రీన్ పాస్పోర్ట్ ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులకు మొక్కలు సరఫరా చేయడానికి నమోదు చేసుకోవడానికి యాప్ అందుబాటులో మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖాధికారులు, విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వైకల్య రోగులను పరామర్శించిన మనోబంధు చైర్మన్ రామకృష్ణమరాజు




కడప పెన్ పవర్ జూలై 3 : కడప నగరం రిమ్స్ హాస్పిటల్ నందు మానసిక వైద్య కళాశాలను సందర్శించి అక్కడి రోగులను పరామర్శించారు. రోగులకు ఇచ్చేటటువంటి మెడిసిన్ లను గురించి ఆరోగ్యాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మనో బంధు చైర్మన్ రామ కృష్ణమరాజుతో రాయలసీమ కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, ప్రముఖ డాక్టర్ శ్రీనివాసులు, కారుణ్య స్వచ్ఛంద సేవా సంస్థ చైర్ పర్సన్ అనూష తదితరులు మానసిక ఆరోగ్య సంరక్షణ భాగంలో కడప హాస్పిటల్ ను సందర్శించడం జరిగినది.






# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు అందజేత




**వి.ఆర్.పురం, పెన్‌పవర్, జూలై 5 :** మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో శనివారం మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ,జనసేన మండల మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీలరాణి ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు,ఇన్సూరెన్స్ ఐ.డి. కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోరే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,సంవత్సరం కాలంలోనే అవినీతి లేని పాలన,గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారని,అన్నారు.గిరిజనుల పట్ల చూపిస్తున్న శ్రద్ధ,ప్రేమ అంతా ఇంతా కాదని,గ్రామ పంచాయతీల అభివృద్దే లక్ష్యమని పేదల కన్నీరు తుడిచే పార్టీ జన సేన పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగుల అంజనరావు,సహాయ కార్యదర్శిలు ముంజపు శ్రీరామ్, మాచర్ల వేణు బాబు,యూత్ నాయకులు పెడపెట్ల పవన్ కళ్యాణ్, ముంజపు సాయిరాం,గూటాల సమ్మరాజు, కాపారపు పవన్ కుమార్, బొర్రా రాజేష్, గూటల పుల్లేష్,పొడ్డుల అప్పన్న,చోడే గంగాధర్, కెచ్చల పోసిరెడ్డి,ముత్యాల సింహాద్రి,పిడుగురాళ్ల నాగేంద్ర,కోట్ల అమ్మాజీ,కడుపు కుమారి, కామేశ్వరి జన సైనికులు పాల్గొన్నారు.







కడప నగర శివారిలో ఆవులను లారీలలో తరలిస్తున్న దృశ్యం.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దు




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 5 :** స్మార్ట్ మీటర్లు , ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు పెంపుపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని లేనిపక్షంలో వీధి పోరా టాలకు సైతం వెనుకాడ బోమని సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు హెచ్చరిం చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలిపివేయాలని, అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని, ట్రూఅఫ్ ఛార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సబ్ స్టేషన్ వద్ద సిపిఐ నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ భారాలపై ప్రజలకు షాక్ లు కొడుతున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 4 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి కోట్లాది రూపాయల భారం ప్రజలపై మోపారని నిప్పులు చెరిగారు. అదానీ విద్యుత్ ఒప్పందం వల్ల వచ్చే పాతికేళ్లు నెల నెలా ప్రజలు అదనంగా డబ్బు కట్టాల్సిం దేనని దీనిపై పునరాలోచిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కో స్మార్ట్ మీటరుకు 18 వేలు ఖర్చువుతోందని దీన్ని ఎవరిపై రుద్దుతారని ఆయన ప్రశ్నించారు. నెలా నెలా ఇచ్చే విద్యుత్ బిల్లులో స్మార్ట్ మీటర్లు బిల్లులు సైలెంట్ గా కలిపేస్తారని ఆయన విమర్శించారు. స్మార్ట్ మీటర్లతో కరెంట్ యూనిట్లు రెండు, మూడు రెట్లు అదనంగా నమోదవు తాయని, వాటిని బిగిస్తే తిరుగుబాటు తప్పదని మండల నాగేశ్వరరావు హెచ్చరించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది బి.హనుమంతు, ఎ.వి.వి.సత్యనారాయణలకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు వర్మ, నాగరాజు నాగలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ఎస్.భవాని, కె.లక్ష్మి, కె.పోలమ్మ జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అవ్వ గుడిసెకు మానవతా ఆశ్రయం



**పెన్ పవర్, ఉంగుటూరు, జులై 5 :** ఉంగుటూరు మండలం కైకరం గ్రామం 12వ వార్డులో నివసించే వాసె కాంతమ్మ (80) అనాథ జీవితం గడుపుతోంది. నలుగురు సంతానముండి ఉండాల్సిన ఈ వృద్ధ మహిళకు భర్త మరణించిన 20 సంవత్సరాలుగా ఎవరూ తోడు లేకుండా జీవితం సాగిస్తున్నారు. ఇంటి గుడిసె నాలుగు వైపులా గుంజలు జారిపోవడంతో ఏ క్షణమైనా కూలిపోవచ్చనే భయంతో గడిపేస్తున్నారు. గ్రామ వార్డు సభ్యుడు నత్త వెంకటేశ్వరరావు మానవతా దృక్పథంతో స్పందించారు. కాంతమ్మకు రోజూ రెండు పూటలా భోజనం ఏర్పాటుచేయడమే కాదు, గుడిసె ప్రమాదకరంగా ఉందని మానవతా స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మానవతా రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల కమిటీ అధ్యక్షుడు కోనె వీర వెంకట సత్యనారాయణ వెంటనే స్పందించారు. గుడిసెకు మరమ్మత్తులు చేసి నిలువునీడ కల్పించేందుకు ముందుకు వచ్చారు. స్థానికులు మానవతా సభ్యుల దయాగుణానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నదాన పథకానికి విరాళం

**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 :** మండల పరిధిలోని తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారికి దాతలు అన్నదాన పథకానికి విరాళం అందించారు. రాజానగరం మండలం ముక్కినాడ గ్రామానికి చెందిన అన్నదాసు సాయిరాం, స్వాతిమణి దంపతులు రూ. 1,08,000 విరాళం అందజేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శుభం.. బాలినేని అదృష్టం పండింది ..!



ఔను.. ఒంగోలు రాజకీయ నాయకుల్లో ఇదే చర్చ సాగుతోంది. ఏ ఇద్దరు కలుసుకున్నా.. బాలినేని అదృ ష్టం పండిందనే చెబుతున్నారు. ప్రస్తుతం జనసేనలో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డికి.. ఆ పార్టీ అధినేత అభయం ప్రసాదించారని అంటున్నారు. త్వరలోనే ఆయనకు కీలకమైన శు భవార్త అందుతుందని చెబుతున్నారు. దీనిపైనే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతుండడం గమనార్హం గత ఎన్నికల తర్వాత వైసీపీ నుంచి బయటకు వచ్చిన బాలినేని జనసేనలో చేరారు.నేరుగా ఆయన జనసేన నాయకులు నాగబాబు, పార్టీ చీఫ్ పవన్‌ను కలిసి.. ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సమయంలో ఆయన ఎమ్మెల్సీసీటు కావాలని కోరారన్న ప్రచారం జరిగింది. అయితే.. ఇప్పటి వరకు నెరవేరలేదు. సుమారు 8 మాసాలుగా బాలినేని ఎదురు చూస్తున్నారు. కానీ.. దీనిపై క్లారిటీ రాలేదు. తాజాగా ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్.. చివరి నిముషంలో బాలినేనిని ఆకాశానికి ఎత్తేశారు. ఆయనను తనకు అత్యంత ఆప్తుడిగా పేర్కొన్నారు.చాలా నిఖార్సయిన రాజకీయ నాయకుడిగా కూడా పవన్ ప్రశంసించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా తనకు ఎంతో సాయం చేశారని.. బాలినేని గురించి పవన్ చెప్పడం గమనార్హం. అనంతరం.. ఇరువురు నాయకులు రెండు నిమిషాల పాటు.. ప్రత్యేకంగా చర్చించుకున్నారు. ఈ చర్చల తర్వాతే.. బాలినేని అదృష్టం పండిందన్న వాదన బయటకు వచ్చింది. అంటే.. దీనిని బట్టి.. త్వరలోనే బాలినేనికి ఎమ్మెల్సీ చాన్స్ దక్కే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అయితే.. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాలేదు.ఇదిలావుంటే.. స్థానికంగా బాలినేనిని వ్యతిరేకిస్తున్న జనసేన నాయకుడు కాశీనాథ్ సహా కొందరికి పవన్ కల్యాణ్.. పరోక్షంగానే బాలినేని వాల్యూ తెలిసేలా కామెంట్లు చేశారు. బాలినేని చాలా ముఖ్యనాయకుడని.. ఆయనతో తనకు ఎంతో పరిచయం ఉందని వ్యాఖ్యానించారు. తద్వారా.. ఇప్పటి వరకు బాలినేని విమర్శిస్తూ వచ్చిన నాయకులను పవన్ కంట్రోల్ చేసినట్టు అయింది. దీంతో ఇప్పటి వరకు పార్టీ మారినా.. పెద్దగా దూకుడు లేని బాలినేని ఇక నుంచి యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏదేమైనా.. పవన్ ప్రకాశం పర్యటన.. బాలినేనిని ఖుషీ చేసిందన్నది వాస్తవం.

# 3 ఇన్నింగ్స్ లు.. 300 పరుగులు.. ఆ పేస్ బౌలర్ పై దారుణ ట్రోలింగ్




ఇంగ్లండ్ తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో టీమ్ ఇండియా తరఫున యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్, కెప్టెన్ శుబ్ మన్ గిల్, సీనియర్ బ్యాట్స్ మన్ కేఎల్ రాహుల్ సెంచరీలతో దుమ్మురేపుతున్నారు. వీరితో పాటు మరో ఆటగాడు కూడా 'సెంచరీలు' చేస్తున్నాడు.. కానీ, అది బ్యాట్ తో కాదు.. బంతితో.. మంచి పేస్ తో పాటు ఎత్తు ఉన్న అతడు ఇంగ్లండ్ పిచ్ లపై బౌన్స్ రాబట్టి వికెట్లు తీస్తాడని తుది జట్టులోకి తీసుకుంటే తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. వికెట్లు తీయడం అటుంచి.. టి20ల స్థాయిలో పరుగులు ఇచ్చేస్తున్నాడు. అతడు బంతి అందుకుంటే ప్రత్యర్థి బ్యాట్స్ మెన్ కు పండుగే అన్నట్లు ఉంది పరిస్థితి. ఇటీవలి ఐపీఎల్ లో ప్రసిద్ధ్ క్రిష్ణ టాప్ వికెట్ టేకర్. మొత్తం 25 వికెట్లతో పర్పుల్ క్యాప్ గెలుచుకున్నాడు. ఆ ప్రదర్శనతోనే అతడిని ఇంగ్లండ్ తీసుకెళ్తే దారుణంగా విఫలం అవుతున్నాడు. తొలి టెస్టులో ఏకంగా రెండు ఇన్నింగ్స్ లో కలిపి 220 పరుగులు ఇచ్చేశాడు. ఐదు వికెట్లు తీశాడన్న మాటే కానీ.. ఇంగ్లండ్ చేసిన మొత్తం 838 పరుగుల్లో 25 శాతం ప్రసిద్ధ్ వే అయితే ఎలా?ఇక రెండో టెస్టులోనూ ప్రసిద్ధ్ పూర్తిగా గాడి తప్పాడు. పిచ్ నుంచి సహకారం లేదనే సంగతి వాస్తవమే. కానీ, పరుగులు ఇవ్వకుండా బ్యాట్స్ మెన్ ను కట్టడి చేయడమూ ముఖ్యమే కదా..? ఈ టెస్టులో ఏకంగా 13 ఓవర్లలో 72 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేదు. షార్ట్ పిచ్ బంతుల వ్యూహం పనిచేయకపోవడంతో ప్రసిద్ధ్ ను ఇంగ్లండ్ వికెట్ కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ ఉతికి ఆరేశాడు. అసలు స్మిత్ సెంచరీకి ప్రసిద్ధ్ బౌలింగే కారణమని సోషల్ మీడియాలో ట్రోలింగ్ నడుస్తోంది.ఓవైపు ఎడమచేతివాటంతో పాటు స్వింగ్ బౌలర్ అయిన అర్షదీప్ సింగ్ ను కాదని ప్రసిద్ధ్ ను ఆడిస్తున్నా.. అతడు తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. దీంతో నెటిజన్లు ఓ ఆట ఆడుకుంటున్నారు. "ప్రసిద్ధ్ కంటే.. 35 ఏళ్ల భువనేశ్వర్ మంచిగా బౌలింగ్ చేస్తున్నాడు. అతడు స్వింగ్ బౌలర్ కూడా. ఇంగ్లండ్ లో వికెట్లు తీయగలడు" అని ఒకరు... "ఇదేం సెలక్షన్? ప్రసిద్ధ్ ఓవర్ కు 6 బౌండరీలు ఇస్తున్నాడు. అర్షదీప్ డరెస్సింగ్ రూమ్ లో ఉన్నాడు. ప్రసిద్ధ్ మ్యాచ్ లు ఆడుతున్నాడు" అని మరొకరు దుమ్మెత్తిపోశారు. "విరాట్ కోహ్లి కాదు.. ప్రసిద్ధ్ క్రిష్ణ రన్ మెషిన్. భారత్ తరఫున హారిస్ రవూఫ్ (భారీగా పరుగులిచ్చే పాక్ పేసర్)" అని ఇంకొకరు ఎద్దేవా చేశారు. ప్రసిద్ధ్ కు రిటర్న్ టికెట్ బుక్ చేయండి.. బిజినెస్ క్లాస్ టికెట్ కొనిస్తా అని మరో అభిమాని ప్రపోజ్ చేశాడు.

# చిన్నమ్మ కోసం చంద్రబాబు చక్రం తిప్పుతారా ..!



రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని అంటారు. అలానే.. చంద్రబాబు కుటుంబాని కి.. దగ్గుబాటి కుటుంబానికి మధ్య రాజకీయ వైరుధ్యాలు ఒకప్పుడు ఉన్నా.. ఇప్పుడు దాదాపు సమసిపోయా యన్న భావన అయితే ఉంది. ఒకప్పుడు ఆ ఇంటిపై కాకి.. ఈ ఇంటిపై వాలని విధంగా రాజకీయాలు చేసుకున్నారు. పరస్పర వైరుధ్యంగా రాజకీయాలు చేసుకున్నారు. కానీ, గత కొన్నాళు ్లగా ఈ రెండు కుటుంబాలు కలిసిపోయిన పరిస్థితి కనిపిస్తోంది.ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షురాలు రేసులో ఉన్నారని భావిస్తున్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విషయంలో చంద్రబాబు చక్రం తిప్పుతారా? అనే చర్చ తెరమీదికి వచ్చింది. ప్రస్తుతం ఈ విషయం కూటమి పార్టీల్లోనూ చర్చగా మారింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడుగాఉన్న జేపీ నడ్డా .. ఈ నెల ఆఖరులో ఆ పదవిని వదులుకోనున్నారు. ప్రస్తుతం దేశంలోని 19 రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షులను మారుస్తోంది. వీరి ఎంపిక పూర్తయిన దరిమిలా వెంటనే జాతీయ నాయకత్వంపై దృష్టి పెట్టనుంది.ఈ దఫా దక్షిణాది నుంచి జాతీయ అధ్యక్ష పదవికి నాయకులను ఎంపిక చేయాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఉత్తరాదిలో ఓటు బ్యాంకు తగ్గుతున్న నేపథ్యంలో బీజేపీ దక్షిణాదిపై ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. పైగా.. దక్షిణాదిలోనూ ఎక్కువ మంది మిత్రులు ఉన్నారు. ఈ క్రమంలోనే దక్షిణాదికి చెందిన వారిని పార్టీ చీఫ్‌లుగా తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, వానతి శ్రీనివాసన్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.ఈ ముగ్గురిలో ఎక్కువగా అవకాశం దగ్గుబాటికే ఉందన్న చర్చ కూడా ఉంది. దీనికి కారణం.. కూటమిలో మిత్ర పక్షంగా ఉన్న టీడీపీ అధినేత చక్రం తిప్పే అవకాశంఉందని సమాచారం. వాస్తవానికి బీజేపీ వ్యవహారమే అయినా.. చంద్రబాబు చెబితే.. కేంద్రంలోని వారు కూడా వింటారన్న వాదన ఉంది. గతంలోనూ రెండు మూడు సార్లుఇలానే జరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు చిన్నమ్మకు కూడా.. చంద్రబాబు చక్రం తిప్పే అవకాశం లేకపోలేదని.. కొందరు అభిప్రాయపడుతున్నారు.

మెకు కూడా బీజేపీలో మంచి పలుకుబడి ఉండడం.. ఏపీలో కూటమి కట్టడంలోనూ.. అధికారంలోకి తీసుకురావడంలోనూ కీలకం గా వ్యవహరించిన నేపథ్యంలో బీజేపీ సంతృప్తిగానే ఉంది. సో.. ఈ పరిణామాలన్నీ కలిసి వచ్చి.. పురందేశ్వరికి పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# 'అతి' కూడా మంచిది కాదేమో బాబూ.. !



ఎప్పుడూ మంచిది కాదు. అది రాజకీయాలైనా, వ్యక్తిగతమైన, కుటుంబ సంబంధాలైన అతిగా వ్యవహరించిన, అతిగా మా ట్లాడిన, అతిగా విమర్శించిన.. ఎప్పటికీ అది ప్రమాదకరమైన సంకేతాలనే ఇస్తుంది. అతిగా విమర్శించి, అతిగా తిట్టిపోసిన నాయకులు తర్వాత కాలంలో రాజకీయంగా పుంజుకున్నారనేది అందరికీ తెలిసిందే. ఉదాహరణకు ప్రధాన మంత్రిగా ఉన్న నరేంద్ర మోడీని 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున ప్రచారం చేసింది. ఆయనను సంఘ విద్రోహ శక్తిగా.. మతాల మధ్య చిచ్చుపెట్టే నాయకుడిగా.. ముస్లిం మైనారిటీలకు వ్యతిరేక వ్యక్తిగా కూడా దేశవ్యాప్తంగా ప్రచారం చేసింది. కానీ ఇదే వ్యతిరేక ప్రచారం.. నరేంద్ర మోడీ పట్ల ప్రజల్లో చర్చకు వచ్చేలాగా చేసింది. తర్వాత కాలంలో ఆయన ప్రధాని కావడానికి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వ్యతిరేక ప్రచారం ఒక కారణమనేది రాజకీయ విశ్లేషకులు చెబుతారు. ఆయన ఒక్కడే కాదు కేసీఆర్ను కూడా గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు తీవ్ర స్థాయిలో అసెంబ్లీలోను బయట కూడా విమర్శలు గుప్పించేవారు. – మీ వల్ల ఏం జరుగుతుంది. మీరు ఏం సాధిస్తారు – అని వైయస్ అడిగిన ప్రశ్నలు అసెంబ్లీలో పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చాయి. ఆ తర్వాత బహిరంగ సభలో కూడా కేసీఆర్ వల్ల ఏమీ కాదని చెప్పుకొచ్చారు. ఇలా కేసీఆర్ ను ఒక విలన్ గా, ఒక రాజకీయ అసమర్ధుడిగా చేసిన ప్రచారం.. తర్వాత కాలంలో ఆయనను ప్రజల్లో మరింత రాటు తేలే నాయకుడిగా మార్చాయి. అంటే అతిగా ప్రచారం చేయటం అనేది ఆనాడైనా.. ఏనాడైనా రాజకీయాల్లో మంచిది కాదు. ఇక ప్రస్తుత విషయానికి వస్తే జగన్ ను మరింతగా టార్గెట్ చేస్తూ చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు అంత మంచిది కాదనే అభిప్రాయం టిడిపి నాయకులు మధ్య వినిపిస్తోంది. సీనియర్ నాయకుల నుంచి జూనియర్ నాయకుల వరకు కూడా జగన్‌ను అనవసరంగా మనం ఎక్కువగా టార్గెట్ చేస్తున్నామేమో అని వ్యాఖ్యానిస్తున్నారు.ఇటీవల జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఒకరిద్దరు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు.. ఇదే అభిప్రాయాన్ని చంద్రబాబు ముందు చెప్పుకొచ్చారు. మనం అనవసరంగా జగన్ను టార్గెట్ చేయడం వల్ల ఆయనపై ప్రజల్లో నిరంతరం చర్చకు వచ్చేలాగా చేస్తున్నామేమో అన్న సందేహాలను వ్యక్తం చేశారు. కానీ దీని విషయంలో చంద్రబాబు చాలా తీవ్రంగా స్పందించారు. %--%నాకు తెలియదా? మీరా నాకు చెప్పేది? నేను తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. మీరు ఒక్కసారి గెలిచారు. మీరు నాకు పాఠాలు చెబుతారా?%--% అంటూ చంద్రబాబు సీరియస్ అయ్యారు. కానీ వారు చెప్పిన దాంట్లో ఒకంత వాస్తవం అయితే లేకపోలేదు.

ఎందుకంటే అతిగా విమర్శిస్తూ పోతే జగన్‌ను విలన్‌గా చూపిస్తూ పోతే ప్రజల్లో ఆయన పట్ల సానుకూలత, సానుభూతి పెరిగే అవకాశం లేకపోలేదు, ఇది రాజకీయాల్లో సహజంగా ఏర్పడేటటువంటి ఒక ప్రక్రియ. గతంలో జగన్ కూడా పవన్ కళ్యాణ్ ను పదేపదే విమర్శించడం వల్ల కాపులంతా ఏకమయ్యే పరిస్థితిని తీసుకువచ్చారు. ఇది ఆయనకు ఎంత మేలు చేసిందో ఎంత కీడు చేసిందో అందరికీ తెలిసిందే. అదే విధంగా చంద్రబాబును ఇక జైలుకే పరిమితం చేయాలి అని ఊహించి ఆయనను ఇబ్బంది పెట్టిన తీరు, అసలు టిడిపి లేకుండా చేయాలి.. మనమే 30 సంవత్సరాల పాటు అధికారంలో ఉండాలి.. అనే విధంగా వ్యవహరించిన విధానం వంటివి కూడా జగన్ను తీవ్ర స్థాయిలో ఇరకాటంలోకి నెట్టి చివరకు ఏం చేశాయి అనేది అందరికీ అర్థమైంది.

ఇంత పరిస్థితి టిడిపికి రాకపోయినా ఇప్పుడు జనంలో జగన్ గురించి చర్చ వచ్చేలాగా చంద్రబాబు పదేపదే ఆయనను టార్గెట్ చేయడం మంచిది కాదన్నది పార్టీ నాయకులు సూచిస్తున్న మాట. అవకాశం, అవసరం, సందర్భాన్ని బట్టి ప్రతిపక్షాన్ని విమర్శించడం వరకు తప్పు లేదని, కానీ ప్రతి విషయంలోను జగన్‌ను టార్గెట్ చేయటం ప్రతి విషయాన్ని ఆయనకు ముడిపెట్టి విమర్శించడం వల్ల కొత్తగా వచ్చే లాభం ఏమీ లేదని అంటున్నారు. మరి ఈ విషయంలో చంద్రబాబు ఏ వ్యూహంతో ఉన్నారు అనేది తెలియాల్సి ఉంది.

# పాకిస్తాన్ కి మైక్రోసాఫ్ట్ గుడ్ బై.. రోడ్డు మీదకు వచ్చిన పాకిస్తాన్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్స్

ప్రపంచంలోని అతిపెద్ద సాంకేతిక సంస్థలలో ఒకటైన మైక్రోసాఫ్ట్ పాకిస్తాన్‌లో తన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలికింది. అధికారికంగా ప్రకటన రానప్పటికీ పాకిస్తాన్‌లోని మైక్రోసాఫ్ట్ సీఈవో జవాద్ రెహ్మాన్ "ఇది ఒక శకానికి ముగింపు" అని వ్యాఖ్యానించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నిర్ణయంతో అక్కడ పనిచేస్తున్న అనేక మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతూ రోడ్డెక్కారు. వారి నిరాశ, అనిశ్చితి దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. పాకిస్తాన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మైక్రోసాఫ్ట్ తమ కార్యకలాపాలను నిలిపివేయడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. తమ దేశ పరిస్థితులు సరిగా లేనందుకు తాము బాధ్యులమా అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.




**25 ఏళ్ల సేవలకు ముగింపు**

మైక్రోసాఫ్ట్ పాకిస్తాన్‌లో 2000, మార్చి 7న తన కార్యకలాపాలను ప్రారంభించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అనేక రంగాలలో కీలక సేవలందిస్తూ 'డిజిటల్ పాకిస్తాన్' కలను సాకారం చేయడానికి కృషి చేసింది. గ్రామీణ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు, విద్యాసంస్థలతో భాగస్వామ్యం, యువతకు సాంకేతిక శిక్షణ, చిన్న వ్యాపారాలకు సాంకేతిక మద్దతు వంటి అనేక మైలురాళ్లను అధిగమించింది.

**ఎందుకు నిష్క్రమణ?**

మైక్రోసాఫ్ట్ ఈ నిర్ణయానికి రావడానికి గల కారణాలపై స్పష్టమైన ప్రకటన వెలువడనప్పటికీ నిపుణుల అంచనాల ప్రకారం పాకిస్తాన్‌లోని రాజకీయ, ఆర్థిక అస్థిరతలే ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. తరచుగా మారుతున్న ప్రభుత్వాలతో స్థిరత్వం లేని రాజకీయ వాతావరణం నెలకొంది. భారీ పన్నుల భారంతో వ్యాపార కార్యకలాపాలపై అధిక పన్నులు గుదిబండగా మారాయి. కరెన్సీ విలువ క్షీణతతో దేశ కరెన్సీ విలువ నిరంతరం పడిపోవడం మైక్రోసాఫ్ట్ కు భారంగా మారింది. టెక్నాలజీ దిగుమతుల్లో ఆంక్షలు.. సాంకేతిక దిగుమతులపై పరిమితులు... పెట్టుబడులపై భద్రతా సందేహాలు.. విదేశీ పెట్టుబడులకు భద్రత లేదనే అంచనాలు... మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలకు పెద్ద దెబ్బగా మారాయి.

**ఆర్థిక సంక్షోభం తీవ్రత**

పాకిస్తాన్‌లో ఆర్థిక సంక్షోభం తీవ్రస్థాయిలో ఉంది. 2024 ఆర్థిక సంవత్సరానికి పాకిస్తాన్ వాణిజ్య లోటు $24.4 బిలియన్లకు పెరిగింది. జూన్ 2025 నాటికి విదేశీ మారక నిల్వలు $11.5 బిలియన్లకు పడిపోయాయి. ఈ పరిస్థితి విదేశీ సంస్థల పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతూ దేశానికి వచ్చే అవకాశాలను తగ్గించింది.

**పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడి ఆవేదన**

ఈ సందర్భంగా పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఆరిఫ్ అల్వీ స్పందిస్తూ "మైక్రోసాఫ్ట్ నిష్క్రమణ పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితికి పెద్ద దెబ్బ. రాజకీయ అస్థిరత వల్ల అవకాశాలు చేజారిపోతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో బిల్ గేట్స్‌తో తాను మాట్లాడినప్పుడు, పాకిస్తాన్‌లో పెట్టుబడులపై ఆసక్తి చూపారని ఆయన గుర్తు చేసుకున్నారు. సత్య నాదెళ్ల, అప్పటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో చర్చలు కూడా జరిగాయని, అయితే ఆ తర్వాత ప్రభుత్వ మార్పులు, అనిశ్చిత పరిస్థితులు మైక్రోసాఫ్ట్‌ను వియత్నాం వంటి ప్రత్యామ్నాయ దేశాల వైపు మళ్లించాయని వివరించారు.

**రోడ్డునపడ్డ ఇంజనీర్లు.. భవిష్యత్తు ప్రశ్నార్థకం**

మైక్రోసాఫ్ట్ నిష్క్రమణతో పాటు, పాకిస్తాన్‌లోని అనేక మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ కంపెనీలో పనిచేసిన ఇంజనీర్లు ఇప్పుడు తమ భవిష్యత్తు ఏమిటని ఆందోళనలో ఉన్నారు. రోడ్డున పడి ఆందోళనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దేశంలోని ఇతర టెక్ కంపెనీలు కూడా తమ వ్యాపార వ్యూహాలను పునరాలోచిస్తున్నాయని సమాచారం. ఒక ప్రఖ్యాత టెక్ దిగ్గజం ఒక దేశాన్ని విడిచి వెళితే, అది కేవలం వ్యాపారపరంగా మాత్రమే కాకుండా ఆ దేశ స్థిరత్వంపై, ప్రపంచ పెట్టుబడిదారుల నమ్మకంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మైక్రోసాఫ్ట్ నిష్క్రమణ పాకిస్తాన్‌కు ఒక గుణపాఠం. అయితే దీన్ని ఒక సవాలుగా స్వీకరించి, వ్యవస్థల పునర్నిర్మాణం వైపు అడుగులు వేయడం ఆ దేశానికి తక్షణ అవసరం.

# జగన్.. మీ ప్రత్యర్థి ఎవరో తేల్చుకున్నారా ..!



వైసీపీ అధినేత జగన్‌కు రాజకీయ ప్రత్యర్థి ఎవరు? అంటే.. తడుముకోకుండా.. చెప్పే మాట చంద్రబాబు!. ఇది వైసీపీ నాయకులే కాదు.. జగన్ కూడా ఇదే భావనతో ఉన్నారు. ఉంటున్నారు కూడా!. కానీ, చంద్రబా బు కంటే కూడా.. బలమైన ప్రత్యర్థి, జగన్‌ను ఓడించి తీరుతామని చెబుతున్న నాయకుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్. ఈయనే అసలు సిసలు ప్రత్యర్థి.. అనడంలో సందేహం లేదు. అయితే.. ఈ విషయాన్ని వైసీపీ గ్రహించడంలో కొంత తాత్సారం చేస్తోందన్నది వాస్తవం. 2014కు ముందు జరిగిన పరిణామాలను గమనించినా.. తర్వాత జరిగిన పరిణామాలను గమనించినా వైసీ పీకి ప్రధాన ప్రత్యర్థి.. పార్టీ కాదు.. వ్యక్తే. ఆయనే పవన్ కల్యాణ్. 2014 ఎన్నికల్లో తాను పోటీ నుంచి దూరంగా ఉన్నా.. అప్పటి కూటమి.. బీజేపీ–టీడీపీలకు మద్దతు ఇవ్వడం ద్వారా తన అభిమాన గణాన్ని ఈ కూటమి వైపు నడిపించారన్నది వాస్తవం. దీంతో 2014లో దక్కాల్సిన అధికారం వైసీపీకి దక్కలేదు. ఇక, 2019 విషయానికి వస్తే.. ఇక్కడ కూడా పవనే జగన్‌కు ప్రత్యర్థి.

అయితే.. అప్పటి వ్యూహం మాత్రం కొంత మేరకు బెడిసి కొట్టింది. అప్పటి టీడీపీ–బీజేపీల మధ్య విభే దా లు రావడం.. ప్రజల్లో ప్రత్యేక హోదాపై ఆశలు ఉండడం. అదేసమయంలో అవినీతి.. ఆరోపణలు కూడా ఎక్కువగా రావడంతో పవన్ చాలా తెలివిగా.. వేర్వేరుగా పోటీకి దిగారు. నిజానికి అప్పట్లో వేర్వేరుగా చేసిన సమయంలో బీజేపీ–టీడీపీ–జనసేనకు ఆశించిన మేరకు సీట్లు వచ్చినా.. తిరిగి చేతులుకలిపేవారు. కానీ.. గుండుగుత్తగా జనం వైసీపీకి మద్దతు పలికారు.

ఇక, 2024 ఎన్నికలకు వచ్చేసరికి నేరుగానే జగన్‌ను టార్గెట్‌చేసి అధికారం నుంచి దింపేస్తామని ప్రకటిం చిన విషయం తెలిసిందే. అదే జరిగింది. అంటే.. మొత్తంగా జగన్ రాజకీయాలను నిశితంగా గమనిస్తున్న నాయకుల్లో పవన్ ముందు వరుసలో ఉన్నారన్నది సందేహం లేదు. సో.. జగన్ రాజకీయ ప్రత్యర్థి కూడా ఆయనే. తాజాగా కూడా.. మరోసారి అధికారంలోకి ఎలా వస్తారో చూస్తామన్న సవాల్ విసరడం ద్వారా.. టీడీపీకంటే ఎక్కువగా వైసీపీని నిలువరించేందుకు పవన్ వ్యక్తిగతంగా ఎంత ప్రయత్నం చేయొచ్చే.. అర్థం అవుతుంది.రాజకీయాల్లో దీనిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఏ నాయకుడి ఇష్టం వారిది. అయితే.. ఒక యుద్ధానికి దిగినప్పుడు లేదా.. దిగుతున్నట్టు అసలు ప్రత్యర్థి ఎవరు? అనేది తెలుసుకోకుండా అడుగులు వేస్తే.. అది ప్రమాదకరం. సో.. ఇప్పటికైనా.. వైసీపీ అధినేత జగన్.. తన ప్రత్యర్థి ఎవరు? అనేది తెలుసుకుని అడుగు లు వేస్తే.. అందుకు తగిన విధంగా తన వ్యూహాన్ని మలుచుకుంటే తప్ప.. తిరిగి ఆయన భావిస్తున్నట్టు అధికారం దక్కడం అనేది జరగకపోవచ్చు.

## 14 ఏళ్లకే ఆల్‌టైం రికార్డ్ బద్దలు: ఇంగ్లాండ్‌ను చితక్కొట్టిన సూర్యవంశీ.. 52 బంతుల్లోనే సెంచరీ






**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ అండర్19 తో జరుగుతున్న యూత్ సిరీస్‌లో టీమిండియా ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాలుగో వన్డేలో చెలరేగి ఆడాడు. ఆడుతుంది వన్డే అయినప్పటికీ.. టీ20 తరహాలో చెలరేగిపోయాడు. శనివారం (జూలై 5) వొర్సెస్టర్‌లో జరుగుతున్న మ్యాచ్ లో ఇంగ్లాండ్ బౌలర్లను చితక్కొడుతూ కేవలం 52 బంతుల్లోనే తన సెంచరీ మార్క్ అందుకున్నాడు. వైభవ్ ఇన్నింగ్స్ లో 10 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. 19వ ఓవర్‌లో ఇంగ్లాండ్ స్పిన్నర్ రాల్ఫీ ఆల్బర్ట్ బౌలింగ్‌లో సింగిల్ తో సెంచరీ మార్క్ అందుకున్నాడు.

ఓవరాల్ గా సూర్యవంశీ 78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సర్లతో 143 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్ తో సూర్యవంశీ మెన్స్ యూత్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. పాకిస్తాన్ ఆటగాడు కమ్రాన్ గులాం 53 బంతుల్లో చేసిన సెంచరీని సూర్యవంశీ బద్దలు కొట్టాడు. ఆరంభం నుంచి వైభవ్.. దూకుడుగా ఆడాడు. ఈ 14 ఏళ్ళ కుర్రాడిని ఆపడానికి ఇంగ్లాండ్ బౌలర్ల వద్ద సమాధానమే లేకుండా పోయింది. ఈ సిరీస్ లో అంతకముందు హాఫ్ సెంచరీలతో అదరగొట్టిన ఈ బీహార్ చిచ్చర పిడుగు నేడు ఏకంగా సెంచరీ చేసి ప్రపంచ క్రికెట్ ను ఆశ్చర్యపరిచాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న ఇండియా అండర్ 19 ప్రస్తుతం 31 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. సూర్యవంశీ (143) రికార్డ్ సెంచరీకి తోడు విహాన్ మల్హోత్రా (63) హాఫ్ సెంచరీ చేసి రాణించాడు. ఆయుష్ మాత్రే 5 పరుగులే చేసి ఔటయ్యాడు.

## చివరి టెస్ట్ ఆడేశాడా: రీ ఎంట్రీలోనూ ఘోరంగా.. ప్రమాదంలో కరుణ్ టెస్ట్ కెరీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవాళీ క్రికెట్ లో అసాధారణంగా రాణించి ఎనిమిదేళ్ల తర్వాత టీమిండియాలో చోటు సంపాదించిన కరుణ్ నాయర్ ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో ఘోరంగా విఫలమవుతున్నాడు. ఇంగ్లాండ్ తో లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో డకౌటయ్యాడు. పోప్ పట్టిన సూపర్ క్యాచ్ కు ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. రెండో ఇన్నింగ్స్ లో 20 పరుగులే చేసి నిరాశపరిచాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో ఎడ్జ్ బాస్టన్ లో జరుగుతున్న రెండో టెస్టులో సాయి సుదర్శన్ లాంటి యంగ్ టాలెంటెడ్ బ్యాటర్ ను పక్కనపెట్టి జట్టు యాజమాన్యం కరుణ్ నాయర్ కు మూడో స్థానంలో ప్రమోషన్ ఇచ్చారు. అయితే వచ్చిన ఈ అవకాశాన్ని కరుణ్ వినియోగించుకోలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్ లో 31 పరుగులు చేసి పర్వాలేదనిపించినా రెండో ఇన్నింగ్స్ లో 26 పరుగులే చేసి విఫలమయ్యాడు. వరుసగా రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్ ల్లో 19 యావరేజ్ తో ఈ కర్ణాటక బ్యాటర్ 77 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. రాహుల్, గిల్, జైశ్వాల్, పంత్ అద్భుతంగా రాణిస్తున్నా ఈ వెటరన్ ప్లేయర్ మాత్రం విఫలమయ్యాడు. మూడో టెస్టులో కరుణ్ కు ఛాన్స్ దక్కే అవకాశం కనిపించడం లేదు. ఒక్కసారి టీంఇండియాలో ఛాన్స్ కోల్పోతే మళ్ళీ ఎంట్రీ ఇవ్వడం చాలా కష్టం. అతని వయసు కూడా 33 ఏళ్ళు కావడం మైనస్ గా మారింది. 2016 లో ఇంగ్లాండ్ పై చెన్నై వేదికగా ట్రిపుల్ సెంచరీ కొట్టి భారత క్రికెట్ తరపున ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్ గా నిలిచాడు. భారత్ తరపున టెస్టులో ట్రిపుల్ సెంచరీ ఒక్కసారిగా అందరి దృష్టి తనవైపుకు తిప్పుకున్నాడు. వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత టెస్టు క్రికెట్‌లో భారత్ తరపున ట్రిపుల్ సెంచరీ సాధించిన రెండో ఆటగాడిగా సరికొత్త చరిత్ర నెలకొల్పాడు. చెన్నై వేదికగా జరిగిన ఈ టెస్టులో 381 బంతుల్లో 303 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. 2017 లో ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర ట్రోఫీలో స్థానం దక్కించుకున్న కరుణ్ విఫలమయ్యాడు. ఒక్క సిరీస్ లో విఫలమైనందుకే ఈ కర్ణాటక స్టార్ ను పక్కన పెట్టడం ఆశ్చర్యం కలిగించింది. కరుణ్ కు అన్యాయం జరిగిందని చాలామంది ఆరోపించారు.

## వన్డేల్లో ద్వైపాక్షిక సిరీస్ తొలగించండి.. ఐసీసీకి క్లాసన్ డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ టీ20 లీగ్ లు ఆడుతూ బిజీగా ఉన్నాడు. ఇటీవలే ఐపీఎల్ ముగించుకున్న ఈ సఫారీ వికెట్ కీపర్ బ్యాటర్.. ప్రస్తుతం మేజర్ లీగ్ క్రికెట్ లో సియాటెల్ ఆర్కాస్ కు ఆడుతున్నాడు. ఈ లీగ్ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో క్లాసన్ అంతర్జాతీయ క్రికెట్ లో వన్డేలపై హాట్ కామెంట్స్ చేశాడు. ఐసీసీకి తన డిమాండ్ ను తెలియజేస్తూ వన్డేల్లో ద్వైపాక్షిక సిరీస్ రద్దు చేయాలని కోరాడు. హెన్రిచ్ క్లాసెన్ ఇటీవల క్రిక్‌బజ్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్యాలెండర్‌లో ద్వైపాక్షిక వన్డే మ్యాచ్‌లు ఇకపై అవసరం లేదని సూచిస్తూ. బదులుగా జట్లు మరిన్ని టెస్ట్ మ్యాచ్‌లు ఆడాలని ఆయన కోరారు. “ నేను కోరుకునే ఏకైక మార్పు ద్వైపాక్షిక వన్డే క్రికెట్‌ను అంతర్జాతీయ క్రికెట్ నుండి దూరంగా ఉంచడమే. ఎక్కువ టెస్ట్ మ్యాచ్‌లు ఆడని జట్లకు ఎక్కువ టెస్ట్ మ్యాచ్‌లు ఇవ్వండి. ఎక్కువ టీ20 క్రికెట్ కు ప్రాధాన్యమివ్వండి”. అని క్లాసెన్ క్రికెట్ క్రికెట్ గురించి తన అభిప్రాయాలను తెలపాల్సిందిగా కోరినప్పుడు ఈ విధంగా చెప్పుకొచ్చాడు. సౌతాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ గా పరిమిత ఓవర్ల క్రికెట్ లో అదరగొడుతున్న హెన్రిచ్ క్లాసెన్ సోమవారం (జూన్ 2) అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి ఆశ్చర్యానికి గురి చేశాడు. వైట్ బాల్ ఫార్మాట్ లో తన పవర్ హిట్టింగ్ తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసే క్లాసన్ క్రికెట్ కు గుడ్ బై చెప్పడం సంచలనంగా మారింది. 33 ఏళ్ళ క్లాసన్ సౌతాఫ్రికా తరపున 60 వన్డేల్లో 2141 పరుగులు.. 58 టీ20ల్లో 1000 పరుగులు చేశాడు. ఓవరాల్ గా తన అంతర్జాతీయ కెరీర్ లో 4 సెంచరీలు.. 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. క్లాసన్ 2024లో టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్ట్ ఫార్మాట్ లో కేవలం నాలుగు టెస్టులు మాత్రమే ఆడాడు. 2019లో రాంచీ వేదికగా భారత్‌పై అరంగేట్రం తొలి టెస్ట్ ఆడిన క్లాసన్.. 2023లో వెస్టిండీస్‌పై తన చివరి టెస్ట్ ఆడాడు. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ నాలుగు టెస్టుల్లో 13 యావరేజ్ తో 104 పరుగులు చేశాడు. సిడ్నీలో ఆస్ట్రేలియాపై చేసిన 35 పరుగులు క్లాసన్ టెస్టు కెరీర్ లో అత్యధికం.

# పిల్లల కోసం విడాకులు తీసుకున్న నటి!



వైవాహిక పుకార్ల మధ్య నుస్రత్ జహాన్ గ్లామరస్ లుక్‌తో తలదా చుకుంది



బాలీవుడ్ నటి ఛాహత్ ఖన్నా గురించి పరిచయం అవసరం లేదు. ‘ది ఫిలిం’, ‘థాంక్యూ’, ‘ప్రస్థానం’, ‘యాత్రాస్’ లాంటి చిత్రాలతో సుపరిచితమే. బుల్లి తెరపైనా అమ్మడు బాగా ఫేమస్. ‘ఖుబూల్’ హై వంటి సీరియల్ ఆమెకు అక్కడా మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. కెరీర్ పరంగా ఎలాంటి ఢోకాలేదు. కానీ వ్యక్తి గత జీవితంలో మాత్రం ఛాహత్ కూడా చాలా ఎదురుదెబ్బలే తిన్నది. 2006 లో భరత్ నర్సింగ్ ను వివాహం చేసుకుంది. కానీ ఆ బంధం ఏడాది కూడా నిలబడలేదు. పెళ్లైన నాలుగు నెలల్లోనే వీగిపోయింది. అటుపై 2013 లో పర్హాన్ మీర్జాను పెళ్లాడింది. కానీ ఐదేళ్ల కాపురం అనంతరం ఆ జోడీ కూడా విడాకులతో వేరైంది. అయితే రెండవ సారి విడాకుల విషయంలో ఛాహత్ ఖాన్నా ఓ కొత్త కారణాన్ని రివీల్ చేసింది. ఆమె మాటలు ప్రకారం భర్తతో ఎలాంటి వివాదం లేకుండానే విడాకులు తీసుకున్నట్లు కనిపిస్తుంది. పిల్లల భవిష్యత్ కోసమే విడాకులు తప్ప మరో కారణం లేదంది. - నాకెప్పుడు సరైంది అనిపిస్తేనే చేస్తాను. దానికే కట్టుబడి ఉంటాను. ఏదైనా తప్పు అనిపిస్తే అలాంటి పని జోలికి వెళ్లను. ఎవరైనా తప్పు చేసినా ధైర్యంగా నిలబడి ప్రశ్నిస్తాను. ఆ ధైర్యం, తెగువ నాలో ఉన్నాయి. తప్పు విష యంలో ప్రపంచమంతా ఒక్క వైపు ఉన్నా? నేను మరోవైపు ఉంటాను. ఆ రకమైన నమ్మకం, ధైర్యం నాకున్నాయి. అలాంటి స్వభావం నాకు చిన్నప్పటి నుంచే అలవాటైంది. పిల్లల కోసం ఎక్కువగా లోచిస్తాను. అలాగే వివాహ బంధం ఎంత బలంగా ఉందన్నది చూసుకుంటాను. సరిగ్గా లేని బంధంలో కొనసాగకూడదు అన్నది నా అభిప్రాయం. ఎందుకంటే పిల్లల కంటే ఏదీ ఎక్కువ కాదు. మనకంటే ఎక్కువగా పిల్లలు ప్రభావితం అవుతారు. అది కలిగించే నష్టం మనకు తెలియకుండానే జరిగిపోతుంది. వారు పెద్దాయ్యాక వారి స్నేహితుల నుంచే ఇలాంటి విషయలు మనకు తెలుస్తాయి. అందుకే కుమార్తెల కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పలేదని-తెలిపింది.



కావ్య కళ్యాణ్‌రామ్ సంతోష కరమైన దృశ్యాన్ని పంచు కున్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com